మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

మంగళవారం 10-03-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 140

**Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District**

## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609




## ప్రజల కోసం జగన్ బయటకు రాడు!

- ఆయనకు ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదు
- కల్తీ పాల బాధితులకు షర్మిల పరామర్శ

**రాజమహేంద్రవరం మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

జగన్ తన సైతాన్ సైన్యాన్ని పరామర్శించడం తప్ప ప్రజల కోసం బయటకు రాడని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. ఆయనకు ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కల్తీ పాల ఘటన బాధితులను ఆమె పరామర్శించారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. వరలక్ష్మీ డెయిరీ పేరుతో 11 ఏళ్ల నుంచి లైసెన్స్ లేకుండా పాల వ్యాపారం చేస్తుంటే ఆహార భద్రతా విభాగం అధికారులు మొద్దు నిద్రపోయారన్నారు. ఈ పాపంలో మాజీ సీఎం జగన్‌కు కూడా భాగం ఉందన్నారు. కల్తీ పాల వల్ల 11 మంది మృతిచెందడం బాధాకరమని, బాధి కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు పశ్చిమ గోదావరి

-మిగతా 3 లో

# భూములు ఆక్రమిస్తే జైలుకు

**పైసా ఖర్చు లేకుండా మీ భూమి మీ చేతికి.**
**దినికోసమే రాజముద్రతో పాస్ పుస్తకాలు: సీఎం**



- క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ తెచ్చాం
- 22ఏలో భూములు పెట్టి, టైటిలింగ్ యాక్ట్ తెచ్చి, వైసీపీ అరాచకం.. రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తం
- ఆ ఒక్క దుర్మార్గం సరిదిద్దడానికే 20 నెలలు
- డిసెంబరు నాటికి పాస్ పుస్తకాల పంపిణీ పూర్తి
- రానున్న రోజుల్లో గూగుల్‌తో నేరుగా భూమి వద్దకు సీమలోని ప్రతి ఎకరాకూ నీరందించడమే లక్ష్యం
- నంద్యాల జిల్లా కొత్తబురుజులో సీఎం ప్రకటన
- 'మీ భూమి - మీ హక్కు'లో రాజముద్రతో పాసుపుస్తకాల పంపిణీ

**నంద్యాల, మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

రాష్ట్రంలో భూములను ఆక్రమిస్తే జైలుకు పంపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ఎంత పెద్దవాళ్లనైనా ఈ విషయంలో వదిలే ప్రసక్తి లేదని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేసి శాశ్వతంగా జైలులో ఉంచుతామని స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం కొత్తబురుజు గ్రామంలో సోమవారం జరిగిన 'మీ భూమి - మీ హక్కు' గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. రైతులకు స్వయంగా పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం వారితో ముఖాముఖి నిర్వహించారు. కొత్త పట్టాదారు పాసు పుస్తకాల్లో వివరాలు సక్రమంగా ఉన్నాయా? లేదా? అని అడిగి

-మిగతా 3 లో



## ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం ప్రభావం

- కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత
- బెంగళూరులో రెస్టారెంట్ల మూసివేత!
- నేటి నుండి మూసివేస్తున్నట్లు వెల్లడి

**న్యూఢిల్లీ**

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావం బెంగళూరులోని రెస్టారెంట్లపై తీవ్రంగా పడింది. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతల కారణంగా ఎల్పీజీ సిలిండర్ల సరఫరా హఠాత్తుగా నిలిచిపోయిందని, దీంతో రేపటి నుంచి నగర వ్యాప్తంగా హోటళ్లను మూసివేస్తామని బెంగళూరు హోటల్స్ అసోసియేషన్ పేర్కొంది. తీవ్ర కమర్షియల్ గ్యాస్ కొరత కారణంగా రేపటి నుంచి రెస్టారెంట్లు, హోటళ్లను నిర్వహించలేమని ఆ ప్రకటనలో తెలిపింది. గ్యాస్ సరఫరా దాదాపు పూర్తిగా ఆగిపోయిందని, అందుకే తాము ఈ నిర్ణయం తీసుకుంటున్నామని వెల్లడించింది.

-మిగతా 3 లో




## బంగ్లాదేశ్‌లో దారుణం

- 16 ఏళ్ల హిందూ బాలుడి హత్య
- ఆటో దొంగతనాన్ని ప్రతిఘటించినందుకు శాంతో కుమార్ సాహా బలి
- ఢాకా-చిట్టగాంగ్ హైవేపై వాహనం కిందకు తోసి చంపిన దుండగులు
- ఫెనీ జిల్లాలో కలకలం: మైనారిటీలపై కొనసాగుతున్న దాడులు
- నిందితుల కోసం సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసుల గాలింపు

**న్యూఢిల్లీ**

బంగ్లాదేశ్ లో మైనారిటీలు అయిన హిందువులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఫెనీ జిల్లా లో ఆటోను దొంగిలించేందుకు యత్నించిన కొందరు దుండగులు.. 16 ఏళ్ల హిందూ బాలుడి ని దారుణంగా హత్య చేశారు. ఢాకా-చిట్టగాంగ్ హైవేపై లాల్‌పోల్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుందని అక్కడి మీడియా

-మిగతా 3 లో



## ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా మొజ్తాబా ఖమేనీ ఎంపిక

- తండ్రి వారసుడిగా పగ్గాలు చేపట్టనున్న 56 ఏళ్ల మొజ్తాబా
- అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ కీలక నిర్ణయం: వ్యతిరేకత మధ్యే మెజారిటీ మొగ్గు
- లండన్‌లో రూ. 2,500 కోట్ల అక్రమ ఆస్తులు: బయటపడ్డ విలాసవంతమైన జీవితం
- మొజ్తాబా నియామకంపై మండిపడుతున్న అమెరికా, ఇజ్రాయెల్
- కొత్త లీడర్‌ను అంతం చేస్తామన్న ఇజ్రాయెల్ హెచ్చరికలు
- యుద్ధం మరియు అంతర్జాతీయ ఆంక్షల మధ్య ఇరాన్ నాయకత్వ మార్పు

**న్యూఢిల్లీ మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

ఇరాన్ తమ దేశ నూతన సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంది. కొత్త సుప్రీం లీడర్‌గా అయతొల్లా ఖమేనీ తనయుడు మొజ్తాబా ఖమేనీని ఎన్నుకున్నట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. 56 ఏళ్ల అయతొల్లా సయ్యద్ మొజ్తాబా హొస్సేని ఖమేనీ అలియాస్ మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌కు మూడో సుప్రీం లీడర్‌గా ఎన్నికయ్యాడు. మొజ్తాబాను ఇరాన్ అసెంబ్లీ నిపుణుల బృందం ఎన్నుకుంది.

-మిగతా 3 లో

## మహారాష్ట్రలో కొత్త త్రీ వీలర్ ఆటోలు నిషేధం

- రోడ్ల సామర్థ్యం మించడమే కారణమని ప్రకటించిన ప్రభుత్వం
- ముంబైలో రికార్డు స్థాయి ట్రాఫిక్: కిలోమీటరుకు 2,648 ఆటోలు
- వాయు కాలుష్యం, పార్కింగ్ కష్టాలను తగ్గించేందుకే ఈ నిర్ణయం
- ప్రస్తుత ఆటో డ్రైవర్ల ఆదాయం పెంచడమే లక్ష్యం: మంత్రి ప్రతాప్ సర్నాయక్
- మెట్రో, ఎలక్ట్రిక్ బస్సులపైనే ఇక సర్కార్ ఫోకస్

**న్యూఢిల్లీ**

మూడు చక్రాల ఆటోరిక్షాలపై మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త ఆటోరిక్షాలకు అనుమతుల మంజూరును నిలిపివేసింది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ ప్రకటించారు. తాజా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా దీనిపై ప్రకటన చేశారు. రాష్ట్రంలో మూడు చక్రాల ఆటోరిక్షాలు సంతృప్త (గరిష్ట) స్థాయికి చేరుకున్నాయని, అందువల్ల నగరాల్లోని రోడ్ల సామర్థ్యాన్ని, పర్యావరణ సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని కొత్త ఆటోలకు అనుమతుల మంజూరును నిలిపివేశామని ప్రభుత్వం తెలిపింది.2025-26 రాష్ట్ర ఆర్థిక సర్వే ప్రకారం మహారాష్ట్రలో 1.3 మిలియన్ల (12.96 లక్షలు) రిజిస్టర్డ్ త్రీ వీలర్ ఆటోలున్నాయి. ముంబై మెట్రో నగరంలోనూ అధికంగా ఆటోలున్నాయి. గరిష్ట స్థాయిని మించిపోయాయి. ముంబైలో సగటున ఒక కిలోమీటర్‌కు 2,648 ఆటోలు రోడ్లపై

-మిగతా 3 లో






## ఇండస్ట్రీలకు అనుగుణంగా నైపుణ్యాలు

- 99 రోజుల ప్రణాళికలో ఐటీఐలో ఆధునిక కోర్సులు
- కార్మిక మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్,**

తెలంగాణ ప్రభుత్వ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ లో నూతన స్వల్పకాలిక కోర్సులను రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎన్‌సీ మెషిన్ ఆపరేషన్, రోబోటిక్స్, ఈవీ టెక్నాలజీ, ప్రొడక్ట్ డిజైనింగ్ వంటి

-మిగతా 3 లో

## అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు

**కుట్ర బయటపడుతుందనే వెనకడుగు**

- దేశ ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది
- సంక్షోభంతో చమురు ధరల పెరుగే అవకాశం
- కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు డిమాండ్



**న్యూఢిల్లీ మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

భారత ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ఇష్టపడటం లేదని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చ జరిగితే ప్రధాని మోదీ అమెరికా, ఇజ్రాయెల్‌కు ఎలా రాజీ పడ్డారో బయటపడుతుందని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు దేశ ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని

-మిగతా 3 లో

## జర్నలిజం గొప్ప ఫీల్డ్

**వ్యవస్థను గాడిలో పెట్టేది జర్నలిస్టులే**



- అధికారం లేకున్నా.. అజమాయిషీ ఉంది : పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
- జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని వెల్లడి

**నిజామాబాద్ మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

ప్రతి ఒక్క రాజకీయ నాయకుని ఎదుగుదలలో జర్నలిస్టుల భాగస్వామ్యం ఉంటుందని, నాయకులు సరిగ్గా పనిచేయకున్నా.. వ్యవస్థను గాడిలో పెట్టాలన్నా.. సరి చేయాలన్నా.. ఆ పవర్ జర్నలిజానికే ఉందని, అందుకే జర్నలిజం గొప్ప ఫీల్డ్ అని పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ప్రస్తుతం ఈ-పేపర్, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా అంటూ మీడియా అభివృద్ధి చెందుతూ కొత్త పుంతలు తొక్కుతున్నా.. తెల్లారి లేచి నాలుగైదు పేపర్లు చదవడంలోనే తనకు

-మిగతా 3 లో

## శ్రీవారికి అపచారం చేస్తే ఊరుకునేది లేదు

- లడ్డూ కల్తీపై ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు
- గతంలో జరిగిన పొరపాట్లు లేకుండా పట్టాదార్ పాస్ పుస్తకాలు
- నంద్యాల జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబు



**నంద్యాల, మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

: శ్రీవారికి అపచారం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని, మతవిద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోమారు హెచ్చరించారు. లడ్డూ కల్తీపై ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సోమవారం డోన్ నియోజకవర్గంలోని కొత్తబురుజు గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటించారు. రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పాస్‌పుస్తకాలు, సర్వే రాళ్లపై జగన్ ఫొటోలు

-మిగతా 3 లో

# ఆయుధాల దిగుమతుల్లో భారత్ నం.2





**న్యూఢిల్లీ మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

ఆయుధాల దిగుమతిలో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో ఉన్నది. 2021-25 మధ్య కాలంలో ప్రపంచంలో మొత్తం ఆయుధ దిగుమతుల్లో భారత్ వాటా 8.3 శాతం. మొదటి స్థానంలో ఉక్రెయిన్ (9.1 శాతం) ఉన్నది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సిప్రి) తాజా నివేదికలో ఈ వివరాలు వెల్లడించింది.ఇదివరకు రష్యా నుంచి అధికంగా ఆయుధాలను కొనుగోలు చేసిన భారత్.. క్రమంగా ఫ్రాన్స్, ఇజ్రాయెల్, అమెరికా లాంటి పాశ్చాత్య దేశాలవైపు మళ్లుతున్నదని సిప్రి తెలిపింది. అయినప్పటికీ రష్యా నుంచి అధికంగా ఆయుధాలు కొనుగోలు చేస్తున్న దేశం భారతేనని వివరించింది.

# యాసిడ్ దాడి బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు!

### రాష్ట్రాలకు సుప్రీంకోర్టు సూచన



**న్యూఢిల్లీ మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

యాసిడ్ దాడి బాధితుల విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బాధితులందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చేందుకు ఒక విధానాన్ని తీసుకురావాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది.ఉద్యోగాన్ని కల్పించలేకపోతే, బాధితుల జీవనాధారం ఆర్థిక సాయం కల్పించటంపై ఒక పాలసీ తీసుకురావాలని అభిప్రాయపడింది. యాసిడ్ దాడి బాధితురాలు షాహీన్ మాలిక్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పై సూచనలు చేసింది.

# మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు షాక్!



**భోపాల్, మార్చి 9 డ్రీమ్ టైమ్స్**


మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఊహించని షాక్ తగిలింది. 2024లో విజయ్‌పూర్ ఉప ఎన్నికలో గెలుపొందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే.. ఎన్నిక చెల్లదంటూ మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు వెలువరించింది. ఎమ్మెల్యే ముకేశ్ మల్హోత్రా తనపై నమోదైన పెండింగ్ క్రిమినల్ కేసుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో తెలుపలేదని, దీంతో ఆయన ఎన్నికను రద్దు చేస్తున్నట్టు హైకోర్టు పేర్కొన్నది.విజయ్‌పూర్ ఉప ఎన్నికలో రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి రామ్‌నివాస్ రావత్‌ను విజేతగా ప్రకటిస్తూ గ్వాలియర్ బెంచ్ తీర్పు చెప్పింది. జస్టిస్ జీఎస్ అహ్లూవాలియా నేతృత్వంలోని సింగిల్ బెంచ్ వెలువరించిన తీర్పు మధ్యప్రదేశ్ రాజకీయాల్లో సంచలనంగా మారింది.

# ఈశాన్య ప్రాంత ప్రజలకు ఢిల్లీలో రక్షణ లేదు..

### అరుణాచల్ బీజేపీ ఎంపీ ఆవేదన

### సొంత పార్టీ ప్రభుత్వంపై విమర్శలు

**న్యూఢిల్లీ మార్చి 9 డ్రీమ్ టైమ్స్**



ఢిల్లీలో నివసిస్తున్న ఈశాన్య రాష్ట్రాల ప్రజల భద్రతపై అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ తపిర్ గావ్ సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలపై వివక్ష, దాడులు కొనసాగుతున్నాయని ఆయన ఆరోపించారు.ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని ప్రకటిస్తూ ఈశాన్య ప్రాంత ప్రజల కోసం ఓ ప్రత్యేక చట్టపరమైన రక్షణ కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కాగా, గావ్ ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీనే కేంద్రంలోను, ఢిల్లీలోను అధికారంలో ఉండడం గమనార్హం.

# బ్రహ్మోస్ క్షిపణులు కొనేందుకు సిద్ధమైన ఇండోనేసియా..

### -ఇండియాతో 350 మిలియన్ డాలర్ల ఒప్పందం

**న్యూఢిల్లీ మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

భారత ఆయుధ తయారీ, రక్షణ రంగానికి భారీ బూస్ట్ లభించింది. ఇండియా నుంచి బ్రహ్మోస్ క్షిపణులు కొనేందుకు ఇండోనేసియా ముందుకొచ్చింది. దీనికి సంబంధించి 200 మిలియన్ డాలర్ల నుంచి 350 మిలియన్ డాలర్ల వరకు ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ఇండోనేసియా బ్రహ్మోస్ క్షిపణులు కొనుగోలుపై 2023లోనే ప్రచారం జరిగింది. అప్పట్లో అది ప్రాథమిక చర్చల దశలోనే ఉంది.ఇప్పుడు ఈ చర్చలు ఒప్పందం దశకు చేరినట్లు ఇండోనేసియా రక్షణ శాఖ ప్రతినిధి రికో రికార్డో సిరైట్ సోమవారం వెల్లడించారు. తమ దేశం సైనిక, రక్షణ పరంగా ఆధునిక శక్తి సామర్థ్యాలను పెంచుకునే లక్ష్యంలో భాగంగా ఈ ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు అందులోనూ తెలిపారు. సముద్ర తీర దేశం కావడంతో తమకు రక్షణ పరంగా ఇది కీలకమన్నారు. అయితే, ఒప్పందం విలువను మాత్రం వెల్లడించలేదు. ఇంతకుముందు ఫిలిప్పైన్స్‌తో కూడా బ్రహ్మోస్ సంస్థ 2022లో ఒప్పందం కుదుర్చుకుంది. తాజాగా ఇండోనేసియాతో ఒప్పందంపై బ్రహ్మోస్ సంస్థ కానీ, భారత రక్షణ శాఖ కానీ ఎలాంటి ప్రకటనా చేయలేదు. బ్రహ్మోస్.. అధునాతన, సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్. ఇది నేటి యుద్ధ పరిస్థితులకు తగిన సామర్థ్యం కలిగి ఉంది. దీన్ని ఇండియా, రష్యా కలిపి సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఇండియాకు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో), రష్యాకు చెందిన ఎన్‌పీవో మషినోస్ట్రోనియా సంస్థలు కలిసి సంయుక్తంగా బ్రహ్మోస్ ఏరోస్పేస్ అనే సంస్థను ఏర్పాటు చేశాయి. ఈ కంపెనీయే బ్రహ్మోస్ క్షిపణుల్ని తయారు చేసింది. ఇండియాలోని బ్రహ్మపుత్ర, రష్యాలోని మోస్క్వా అనే నదుల





పేర్లను కలిపి దీనికి బ్రహ్మోస్ అని పేరు పెట్టారు. ఈ క్షిపణులు 2.8 నుంచి 3.0 మ్యాక్ స్పీడ్‌తో వెళ్లగలవు. అంటే శబ్దవేగంకంటే మూడు రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణిస్తాయి. ప్రస్తుతం ఉన్న ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్స్ వీటిని అంత త్వరగా గుర్తించలేవు. ఈ క్షిపణుల్ని సముద్రంపైనుంచి, భూమి పైనుంచి, సబ్ మెరైన్స్ నుంచి, గాలిలో నుంచి కూడా ప్రయోగించవచ్చు. ఫైర్ అండ్ ఫర్గెట్ ప్రిన్సిపిల్‌తో దీన్ని ఆపరేట్ చేస్తే, లక్ష్యాన్ని ఒక మీటర్ పరిధిలో ఛేధించగలదు. దీని రేంజ్ 290 కిలోమీటర్లు. అయితే, ఎక్స్‌టెంటెడ్ రేంజ్ 450 కి.మీ. నుంచి 800 కి.మీ. బ్రహ్మోస్ తర్వాతి తరం క్షిపణులు కూడా సిద్ధమవుతున్నాయి. వీటి రేంజ్ మరింత ఎక్కువగా ఉంటుంది. గత ఏడాది ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఈ క్షిపణుల్ని భారత సైన్యం ప్రయోగించింది. పాకిస్తాన్‌పై ప్రయోగించగా మంచి విజయం సాధించాయి. అందువల్ల వీటికి డిమాండ్ పెరిగిందని నిపుణులు అంటున్నారు.

# మరో ఐదు కూనలకు జన్మనిచ్చిన చిరుతపులి జ్వాల..

### -దేశంలో 50 దాటిన చిరుతల సంఖ్య

**న్యూఢిల్లీ మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

: దేశంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రాజెక్ట్ చీతా మరో కీలక మైలురాయిని అందుకుంది. మధ్యప్రదేశ్ (మీఙఙప్రఖఙజూతీఙఎవంప్ర) లోని కునో నేషనల్ పార్క్‌లో సోమవారం 'జ్వాల' అనే ఆడ చీతా ఐదు కూనలకు జన్మనిచ్చింది. దాంతో దేశంలో చీతాల సంతతి మరింత పెరిగింది. ఈ కొత్త కూనల రాకతో దేశంలో పుట్టిన చీతా పిల్లల మొత్తం సంఖ్య 33కు చేరుకుంది. అదేవిధంగా దేశంలోని మొత్తం చీతాల సంఖ్య 53 కి పెరిగింది.ఈ శుభవార్తను కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ఇది 'ప్రాజెక్ట్ చీతా'కు గర్వకారణమని ఆయన అభివర్ణించారు. విజయవంతంగా మూడోసారి తల్లి అయిన 'జ్వాల' కూనో నేషనల్ పార్క్‌లో ఐదు కూనలకు జన్మనిచ్చిందని చెప్పారు. ఇది భారతదేశ వన్యప్రాణి సంరక్షణ ప్రయత్నాలలో మరొక మైలురాయి అని పేర్కొన్నారు. ఇవాళ జన్మించిన కూనలతో కలిపి భారతదేశంలో పుట్టి ఆరోగ్యంగా పెరుగుతున్న చీతా పిల్లల సంఖ్య 33కి పెరిగిందని అన్నారు. భారతదేశ గడ్డపై ఇది 10వ విజయవంతమైన చీతాల జననం అని మంత్రి తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ప్రాజెక్ట్ విజయం కోసం క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమిస్తున్న పశు వైద్యులు, అటవీ అధికారులు, సిబ్బంది అంకితభావానికి ఇది నిదర్శనమని కొనియాడారు.



మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ కూడా ఈ పరిణామంపై సంతోషం వ్యక్తంచేశారు. ఇది వన్యప్రాణుల సంరక్షణలో ఒక చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. జ్వాల చీతా ఐదు కూనలకు జన్మనివ్వడం ప్రాజెక్ట్ చీతాలో మరో గొప్ప విజయమన్నారు. దాంతో దేశంలో చీతాల జనాభా అర్ధసెంచరీ మార్కును దాటి 53కి పెరిగిందని చెప్పారు. 2022లో సెప్టెంబర్ 17న నమీబియా నుంచి తొలి విడతలో భారత్‌కు తీసుకొచ్చిన ఎనిమిది చీతాల్లో 'జ్వాల' ఒకటి. భారత్‌కు వచ్చినప్పటి నుంచి ఇది మూడోసారి పిల్లలకు జన్మనిచ్చింది. కాగా గత నెలలోనే 'గామిని' అనే మరో చీతా కునో పార్క్‌లో నాలుగు కూనలకు జన్మనిచ్చింది. అలాగే ఫిబ్రవరి 28న బోట్స్వానా నుంచి ఆరు ఆడ, మూడు మగ చీతాలతో కూడిన మూడో బ్యాచ్‌ను కునో పార్క్‌లోకి విడుదల చేశారు. ఆ తర్వాత కొద్దిరోజులకే ఈ శుభవార్త వెలువడింది.

# అమెరికాకు రూ.923 కోట్ల వెనెజువెలా బంగారం..!

**న్యూఢిల్లీ మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

వెనెజువెలా నుంచి అమెరికా కు ఏకంగా 100 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.923 కోట్లు) విలువైన బంగారం వచ్చింది. ఈ విషయాన్ని అమెరికా హోంమంత్రి డగ్ బర్గమ్ ధ్రువీకరించారు. శుక్రవారం వెనెజువెలా నుంచి రూ.923 కోట్ల బంగారం వచ్చిందని, ఇంకా ఆ దేశంలో 500 బిలియన్ డాలర్ల విలువైన బంగారం వనరులు ఉన్నాయని బర్గమ్ చెప్పారు.వెనెజువెలా ప్రభుత్వ ఆధ్వర్యంలోని బంగారం మైనింగ్ కంపెనీ మినర్వెన్‌తో లావాదేవీలకు అనుమతిస్తూ అమెరికా ఇప్పటికే లైసెన్స్ జారీచేసింది. ఆ సంస్థతో కలిసి తవ్వకాలు చేపట్టింది. ఇటీవల వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్‌తో బర్గమ్ భేటీ అయ్యారు. అలాగే అమెరికా మైనింగ్,




మినరల్ కంపెనీలతోనూ చర్చలు జరిపారు. ఈ పరిణామాల తర్వాతే మంత్రి స్పందన వచ్చింది. ఖనిజ సంపన్న ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ఉన్న సంస్థలకు తాము భద్రత కల్పిస్తామని డెల్సీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని బర్గమ్ వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో గెరిల్లా గ్రూపులు, ఇతర గ్రూపులు చురుగ్గా ఉంటాయి. తాజా లైసెన్స్ కింద ఉత్తరకొరియా, రష్యా, ఇరాన్, క్యూబాకు చెందిన వ్యక్తులు, సంస్థలతో మినర్వెన్ ఒప్పందాలు చేసుకోవడంపై నిషేధం ఉంది. వెనెజువెలాలో సమృద్ధిగా ఉన్న కీలక ఖనిజాలపై చైనా ఆధిపత్యాన్ని ఎదుర్కొనేలా ట్రంప్ యంత్రాంగం ఈ చర్యలు తీసుకుంటోంది. అమెరికాలోకి డ్రగ్స్‌ను అక్రమంగా రవాణా చేస్తున్నారంటూ వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను అమెరికా బంధించి తీసుకెళ్లింది. పైకి డ్రగ్స్ పేరు చెబుతున్నప్పటికీ లోపల మాత్రం లాటిన్ అమెరికా దేశాల్లో డ్రాగన్ ప్రాబల్యం తగ్గించడమే అసలు ఉద్దేశమని తెలుస్తోంది. లాటిన్ అమెరికాలో డ్రాగన్ ప్రాబల్యం క్రమంగా పెరుగుతుండటం అగ్రరాజ్యాన్ని కలవరపాటుకు గురిచేస్తోంది. అందుకే లాటిన్ అమెరికాలో వనరులను నియంత్రణలోకి తెచ్చుకునేందుకు అక్కడి దేశాల్లో తన అనుకూల ప్రభుత్వాలను ఏర్పాటుచేసుకునే పనిలో అమెరికా ఉంది.

# ఉన్నావ్ బాధితురాలి వాదనలు విననున్న సుప్రీం

**న్యూఢిల్లీ మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

తన వాదనలు వినిపించేందుకు ఉన్నావ్ అత్యాచార బాధితురాలికి గల హక్కును సుప్రీం కోర్టు సోమవారం గుర్తించింది. అమెపై అత్యాచారం జరిపిన నిందితుడు, బిజెపి మాజీ ఎంఎల్ఎ సెంగార్‌కు బెయిల్‌ను సవాలు చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను బాధితురాలిని కూడా ఒక పక్షంగా చేర్చాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బగ్చిలతో కూడిన



సుప్రీం బెంచ్ ఆదేశించింది. అయితే తన ప్రాణానికి ముప్పు వుందంటూ బాధితురాలి కజిన్, మైనర్ అయిన బాలుడు పెట్టుకున్న దరఖాస్తును సుప్రీం బెంచ్ విచారించలేదు. సిబిఐ పిటిషన్‌తో కలిపి విచారించాలని కోరడానికి బదులుగా స్వతంత్ర లీగల్ పరిష్కారాన్ని దరఖాస్తుదారుడు కోరాలని సూచించింది. అయితే సిబిఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేసు వాయిదాను కోరడంతో ఇక కేసు అర్హతలను కోర్టు పరిశీలించలేదు. తన క్లయింట్‌పై ఈ అఘాయిత్యం జరిగినపుడు ఆమెకు కేవలం 15ఏళ్లని, ఆమెకు తాము జవాబుదారీగా వున్నామంటూ బాధితురాలికి న్యాయం జరగాలని సిబిఐ కోరుతోంది.

## ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం ప్రభావం

మొదటి తరువాయి

యుద్ధం నేపథ్యంలో 70 రోజుల వరకు గ్యాస్ సరఫరాకు గ్యాస్ కంపెనీలు హామీ ఇచ్చాయని, కానీ అందుకు విరుద్ధంగా గ్యాస్ సరఫరా చేయడం లేదని ఆ ప్రకటనలో తెలిపింది. అందుకే ఈ నెల 10వ తేదీ నుంచి రెస్టారెంట్లు, హోటళ్లను మూసివేస్తున్నట్లు పేర్కొంది.

## బంగ్లాదేశ్‌లో దారుణం

మొదటి తరువాయి

తెలిపింది.హత్యకు గురైన బాలుడు శాంతో కుమార్ సాహాగా పోలీసులు గుర్తించారు. అక్కడి మీడియా కథనం ప్రకారం.. మియాజీ ఫిల్లింగ్ స్టేషన్ ముందు ఆటోలో ప్రయాణికుడి కోసం శాంతో ఎదురుచూస్తుండగా.. కొందరు దుండగులు అతడిపై దాడిచేసి, ఆటోను లాక్కునే ప్రయత్నం చేశారు. శాంతో వాళ్లను ప్రతిఘటించడంతో హైవే పక్కన ఉన్న కల్వర్టు కిందకి తోసేశారు. అయినా వెంటనే తేరుకుని దొంగలను వెంబడించిన శాంతోను వారు హత్యచేశారు. రోడ్డుపై వేగంగా వస్తున్న వాహనం కిందకి శాంతోను తోసేశారు. దాంతో ఆ వాహనం ఢీకొని బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. రాత్రి వరకు బాలుడి ఆచూకీ లేకపోవడంతో కుటుంబసభ్యులు గాలిస్తుండగా.. తెలిసిన ఆటో డ్రైవర్ ద్వారా సమాచారం అందినట్లు శాంతో బంధువులు తెలిపారు. శాంతో ప్రయాణికులను ఎక్కించుకున్న ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తే నిందితులను గుర్తించే అవకాశం ఉందని అతడి కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఇఫ్తార్ సమయంలో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని ఆసరాగా తీసుకుని దుండగులు బాలుడిని టార్గెట్ చేసి, ఆటోను ఎత్తుకెళ్లారని రోపించారు. బంగ్లాదేశ్‌లో కొత్తగా ఏర్పడిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ప్రభుత్వ హయాంలోనూ హిందూ వర్గాలపై దాడులు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో మహమ్మద్ యూనస్ పాలనలోనూ మైనారిటీలపై వరుసదాడులు జరిగాయి.

## మహారాష్ట్రలో కొత్త త్రీ వీలర్ ఆటోలు నిషేధం

మొదటి తరువాయి

తిరుగుతున్నట్లు ఆర్టీవో డాటా తేల్చింది. ఇది ఇండియాలోని అన్ని మెట్రో నగరాలకంటే అత్యధికం. ముంబై చుట్టుపక్కల ప్రాంతాల్లోనే 2.5 లక్షల ఆటోలు ఉన్నాయి. దీంతో నగరంలో 'లేన్ టు వెహికల్' స్థాయి మించిపోయింది. పార్కింగ్‌కు కూడా సమస్యలొస్తున్నాయి. ట్రాఫిక్ సమస్య ఎక్కువైంది. పర్యవరణానికి కూడా హాని కలుగుతోంది. ఇప్పటికే ముంబైలో వాయు కాలుష్యం ఎక్కువైంది. ప్రస్తుతం ఏక్యూఐ 170-200 వరకు ఉంది. ఇది అనారోగ్య స్థాయి. సగటున 50-100 వరకు ఉండాలి. సీఎన్‌జీ ఆటోలతో కూడా ఎక్కువ వాయు కాలుష్యం అవుతోంది. ఈ నేపథ్యంలోనే కాలుష్యాన్ని తగ్గించేందుకు ముంబై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మెట్రో కారిడార్ పెంపు, ఎలక్ట్రిక్ బస్సులవైపు దృష్టిసారించింది. అలాగే కొత్త ఆటోలకు అనుమతి నిరాకరించింది. ఈ చర్యల వల్ల ట్రాఫిక్ తగ్గడం, కాలుష్యం తగ్గడంతోపాటు ఆటో రిక్షా నడిపే వారి ఆదాయం కూడా పెరుగుతుంది. అలాగే ఆటోలకు సంబంధించి సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించే వీలుంటుంది. కొత్త ఆటోలు రాకపోవడంతో ఇప్పుడున్న వాటి ద్వారా డ్రైవర్లకు మెరుగైన ఆదాయం లభిస్తుంది.

## ఇండస్ట్రీలకు అనుగుణంగా నైపుణ్యాలు

మొదటి తరువాయి

ఆధునిక కోర్సులను ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. యువతకు ఆధునిక నైపుణ్యాలు పెంచి ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఉపాధి మరియు శిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, అధికారులు, ట్రైనర్లు పాల్గొన్నారు. ఏటీసీ మరియు ఐటీఐ విద్యార్థులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు.

సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. ఈ ప్రణాళికలో తీసుకున్న నిర్ణయాలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కలిగిన యువత అందుబాటులో లేరని అనేక పరిశ్రమలు చెబుతున్నాయని, అందుకే ఇండస్ట్రీలకు అవసరమైన స్కిల్ సెట్స్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఏటీసీలు, ఐటీఐలు భవిష్యత్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో కూడిన శిక్షణ పొందిన నిపుణులను తయారు చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ÷శిటి ప్రపంచంలో ఒక్క నైపుణ్యం సరిపోదని, యువత మల్టీ స్కిల్డ్ ఉంటేనే అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. ఏటీసీల నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి ఉపాధి అవకాశాలు కల్పించేలా శిక్షణా విధానం ఉండాలని ప్రిన్సిపాల్స్‌కు సూచిస్తున్నామని చెప్పారు. ÷-రామీణ ప్రాంతాల్లో టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన కోర్సులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రపంచంతో పోలిస్తే వ్యవసాయ రంగంలో మన ఉత్పాదకత తక్కువగా ఉన్నందున అగ్రి అలైడ్ సెక్టార్‌లో నైపుణ్యాలను పెంచే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ÷ఖనోమ్ వ్యాలీ ప్రాంతంలోని పరిశ్రమల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అక్కడి పరిశ్రమలకు అవసరమైన కోర్సులను కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. ÷ద్యార్థులు జీవితంలో విజయాన్ని సాధించాలంటే క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి ఉండాలని, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

## జర్నలిజం గొప్ప ఫీల్డ్

మొదటి తరువాయి

తృప్తి ఉంటుందని తెలిపారు. నిజామాబాద్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం నగరంలోని బస్వాగార్డెన్‌లో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పంచరెడ్డి శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించగా ఆయన హాజరై ప్రసంగించారు. ఎన్ఎస్‌యూఐ విద్యార్థిసంఘంలో ఉన్నప్పుడు ఏదైనా కార్యక్రమం నిర్వహిస్తే.. తెల్లారి పేపర్ కోసం ఆసక్తిగా ఎదురుచూసేవాళ్లమని, వార్త క్లిప్పింగ్‌లను కట్ చేసుకుని దాచుకునే వారమని అన్నారు. దూరదర్శన్‌లో చిన్న క్లిప్పింగ్ వచ్చేందుకు నానా తంటాలు పడేవారమని.. ఎమ్మెల్యేలతో ప్రయత్నించి న్యూస్ వస్తే ఆనందించే వాళ్లమంటూ నాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. నాయకులకు, జర్నలిస్టులకు అవినాభావ సంబంధం ఉంటుందన్న మహేశ్‌గౌడ్.. తన ఎదుగుదలలో జర్నలిస్టులు కీలకంగా పని చేశారని గుర్తించారు. రాజకీయాలు కరప్షన్, దోపిడీ అన్నట్టు పలువురు వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిని గాడిలో పెట్టే బాధ్యత సైతం జర్నలిస్టులదే అని అన్నారు. ఎల్లో జర్నలిజం కాకుండా వాస్తవాలు రాయాలని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చే బాధ్యత జర్నలిస్టులదని, వాటిని సరిదిద్దే బాధ్యత తమదని తెలిపారు. ప్రస్తుతం పలువురు జర్నలిస్టులకు వేతనాలు వచ్చే పరిస్థితి లేదని, కష్టపడితేనే పూటగడిచే పరిస్థితులు ఉన్నాయని, అందుకే జర్నలిస్టుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల చిరకాలవాంఛ అయిన ఇండ్ల స్థలాలు కేటాయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం సీఎంతో మాట్లాడి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు గల నియమ నిబంధనలు, సుప్రీం తీర్పులు పరిశీలిస్తామని, ఖాళీ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో కలెక్టర్, ఆర్డీవోతో సమావేశం నిర్వహించి ఆరా తీస్తామని అన్నారు. అంతకుముందు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, డా.భూపతిరెడ్డి, మేయర్ కూరగాయల ఉమారాణి తదితరులు మాట్లాడారు. వెల్‌నెస్ ఆస్పత్రిలో జర్నలిస్టులకు, వారి కుటుంబీకులకు ఉచిత ఐపీ, ఓపీ సేవల కోసం రూపొందించిన హెల్త్‌కార్డులను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

# భూములు ఆక్రమిస్తే జైలుకు

(మొదటి తరువాయి)

తెలుసుకున్నారు. భూములను తా రుమారు చేయడానికి వీలులేకుండా క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ప్రభుత్వ రాజముద్రతో పాసు పుస్తకాలను అందిస్తున్నామన్నారు. గత ప్రభు త్వం రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని మం డిపడ్డారు. గత ప్రభుత్వంలో డోన్‌కు చెందిన మం త్రిగా ఉన్న వ్యక్తి సాధారణ రైతు భూమిని తన అనుచరులకు కట్టబెట్టేశారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.95 కోట్ల ఎకరాలను 22ఏలో పెట్టడమే కాకుండా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి ప్రైవేట్ భూములపై నాడు అజమాయిషీ చేశారని, వాటిని సొంత వాళ్లకు కట్టబెట్టారన్నారు. తాము అధికారంలో కి వచ్చిన తర్వాత ఆ యాక్ట్‌ను రద్దు చేశామని గుర్తుచేశారు. వారు చేసిన ఆ ఒక్క దుర్మార్గాన్ని సరిదిద్దడానికే తనకు 20 నెలల సమయం పట్టిందన్నారు. తా ము అందించే పాసు పుస్తకాలను ఎవరూ ట్యాంపరిం గ్ చేయలేరని, తహసీల్దార్లు, వీఆర్వోలు ఒకవేళ తప్పు చేస్తే బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వెంటనే పట్టేస్తుందని తెలిపారు. సర్వే రాళ్లపై జగన్ ఫొటోలు ముద్రించడం కోసం నాడు రూ.750 కోట్లు ఖర్చు చేశారని మండిపడ్డారు. జనాభా తగ్గుతున్న నేపథ్యంలో 'ఒకరు వద్దు.. ఇద్దరు ఓకే.. ముగ్గురు ముద్దు' అనే నినాదంతో ముందుకెళ్లాలని ప్రజలకు సీఎం సూచించారు.

**సీమకు పారిశ్రామిక కళ తెస్తాం**


"ఒక్క పైసా ఖర్చు లేకుండా మీ భూమి మీకు అప్పగించడం నా బాధ్యత. గత ప్రభుత్వంలో 6,860 గ్రామాల్లో రీ సర్వే చేసి అనేక తప్పులతో 19.93 లక్షల పాసు పుస్తకాలను ఇచ్చారు. ఆ రికార్డుల్లో జరిగిన తప్పులను సరిచేసి మళ్లీ కొత్తగా రైతులకు పుస్తకాలను అందిస్తున్నాం. డిసెంబరు నాటికి అందరికీ పాసు పుస్తకాలను అందజేస్తాం. భవిష్యత్తులో గూగుల్ సా యంతో తమ భూముల్లోకి రైతులు వెళ్లే విధంగా టెక్నాలజీని రూపొందిస్తాం. రిజిస్ట్రేషన్ విధానాన్ని మరింత సులభతరం చేస్తాం. హంద్రి-నివా, గాలేరు, ఎస్ఆర్‌బీసీ, తెలుగు గంగ ప్రాజెక్టులకు ఎన్టీఆర్ శ్రీకా రం చుట్టారు. వాటిని కూటమి ప్రభుత్వం పూర్తి చే స్తోంది. ఇప్పటికే డోన్‌లోని 30 చెరువులతోపాటు కుప్పం ప్రాంతానికి నీరు తీసుకెళ్లాం. సీమలో ఉత్పత్తి అయ్యే పంటలను దేశవ్యాప్తంగా మార్కెట్ చేస్తాం. మెరుగైన విత్తనాలతో పాటు కొత్త రకాల పంటలను కూడా ఈ ప్రాంతానికి పరిచయం చేస్తాం."

**రూ. 100 కోట్లతో హార్టికల్చర్ హబ్**

'రాయలసీమలో దేశంలోనే ఎక్కడాలేని విధంగా రూ.100 కోట్లతో హార్టికల్చర్ హబ్‌ను ఏర్పాటు చేస్తాం. పూర్వోదయ పథకం కింద రూ.30 వేల కోట్ల నిధులు అందజేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. సీమలోని ఉద్యాన పంటలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నాం. మామిడి పండ్ల ధర తగ్గిన సమయంలో కిలోకు రూ.4 చొప్పున సబ్సిడీ కల్పించడంతో పాటు కవర్లను సబ్సిడీ రూపంలో అందించాం. కవర్లు తొడిగిన పండ్లతో గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులకు ఎకరాకు రూ.40 వేల వరకు ఆదాయం వస్తోంది. గత ప్రభుత్వంలో భారీగా కుంభకోణాలు జరిగాయి. కల్తీ మద్యం కారణంగా 30 వేలమంది ప్రాణాలు కోల్పోయారు. నెలకు రూ.100 కోట్ల వరకు అవినీతికి పాల్పడ్డారు. తిరుమల లడ్డూను కూడా కల్తీ చేశారు. లడ్డూ కల్తీ, మద్యం అవినీతి, భూదోపిడీలపై ప్రభుత్వం సమగ్ర ప్రక్షాళనకు పూనుకొంటుండగా, కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. లడ్డూపై సీబీఐ సిట్ ఇచ్చిన నివేదికపై కూడా అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. నేను శ్రీవారి భక్తుడిని. స్వామి పవిత్రత కు భంగం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోను సహించేదిలేదు. సొంత బాబాయ్‌ను హత్య చేసి గుండెపోటుగా చిత్రీకరించి నిందను నాపై వేశారు. కర్నూలులో డ్రోన్ సిటీ, అనంతపురంలో ఏరో స్పేస్ సిటీ, ఓర్వకల్లులో పలు పరిశ్రమలు ఏర్పాటు చేయబోతున్నాం. విద్యుత్ చార్జీలు పెంచబోమనే మాటకు కట్టుబడి ఉన్నా. గత వైసీపీ పాలనలో 8 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి, ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం మోపారు. ట్రూ అప్‌చార్జీ రూ.4600 కోట్ల భారం వేశారు. మేం వాటిని రద్దు చేశాం." అని సీఎం తెలిపారు

## ప్రజల కోసం జగన్ బయటకు రాడు!

జిల్లా భీమవరం, కాళ్ల ప్రాంతాల్లో షర్మిల పర్యటించారు. కాళ్లలో జరిగిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ఉపాధి పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ఖూనీ చేస్తున్నా జగన్ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. బీజేపీతో చంద్రబాబుకు పొత్తు, జగన్‌కు అక్రమ పొత్తు ఉంది' అని వ్యాఖ్యానించారు. 'రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎవరూ అడగరు. బీజేపీని ఎదిరించే దమ్మున్న మగాడు రాష్ట్రంలో ఒక్కడూ లేడు. కాలర్ పట్టుకుని నిలదీస్తా.. ప్రత్యేక హోదా తెస్తానని ప్రగల్భాలు పలికిన జగన్.. ఆ తర్వాత ప్రశ్నించలేకపోయారు'అని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, పార్టీ నేతలు జేడీ శీలం, కనుమూరు బాపిరాజు పాల్గొన్నారు.




## ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా మొజ్తాబా ఖమేనీ ఎంపిక

(మొదటి తరువాయి)

ఇందులో 88 మంది ఇస్లాం మత గురువులు ఉంటారు. వీరందరూ కలిసి ఆదివారం సమావేశమై కొత్త సుప్రీం లీడర్ కోసం చర్చ జరిపారు. మెజారిటీ సభ్యులు మొజ్తాబా వైపు మొగ్గు చూపారు. కొందరు సభ్యులు వారసత్వ నాయకత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ.. మెజారిటీ ఉండటంతో మొజ్తాబానే ఎన్నుకున్నారు. ఒకవైపు ఇరాన్‌పై దాడులు కొనసాగుతున్నా, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ కొత్త లీడర్ ఎంపికను ఇరాన్ పూర్తి చేసింది. అతడు, ఎప్పటినుంచి బాధ్యతలు స్వీకరిస్తారో తెలియరాలేదు. మొజ్తాబాకు విదేశాల్లో భారీగా ఆస్తులున్నాయి. అతడికి లండన్‌లో దాదాపు 2,500 కోట్లకుపైగా ఆస్తులున్నట్లు అంచనా. కెన్సింగ్‌టన్ ప్యాలెస్‌లో అతడికి ఖరీదైన అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. 2014 నుంచి లండన్‌లో ఆస్తులు కలిగి ఉన్నాడు. అక్రమ చమురు అమ్మకాల ద్వారా ఇదంతా సంపాదించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఇటీవలి పరిణామాల నేపథ్యంలో లండన్‌లోని అతడి ఆస్తులపై ఇజ్రాయెల్, అమెరికా నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. అతడి ఆస్తులకు భద్రతాపరమైన ముప్పు ఉందని నిపుణులు అంచనావేస్తున్నారు. మరోవైపు మొజ్తాబా ఎంపికను అమెరికా, ఇజ్రాయెల్ అంగీకరించడం లేదు. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునేముందు తమ అనుమతి తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. అలాగే కొత్త లీడర్ ఎవరైనా సరే అంతం చేస్తామని ఇజ్రాయెల్ ఇదివరకే ప్రకటించింది.

## అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు

(మొదటి తరువాయి)

చూపుతాయని తెలిపారు. అలాగే అక్కడి సంక్షోభం చమురు ధరల పెరుగుదలకు దారితీయవచ్చని అభిప్రాయపడ్డారు. "పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. స్టాక్ మార్కెట్లలో ఏం జరుగుతుందో మీరు చూశారు. ప్రధాని మోదీ అమెరికా ట్రేడ్ డీల్‌పై సంతకం చేశారు. దీంతో దేశం దెబ్బ తినబోతోంది. అలాగే పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చించడంలో వారికి ఏ సమస్య ఉంది? ఆ తర్వాత మనం ఇతర అంశాలపై చర్చ జరపవచ్చు. పశ్చిమాసియా మన దేశానికి ముఖ్యం కాదా? ఇంధన ధరలు, ఆర్థిక విధ్వంసం మనకు ముఖ్యమైన చర్చనీయాంశాలు కావా? అవే మనకు ప్రజా సమస్యలు" అని రాహుల్ గాంధీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని తాము ముఖ్యమైనదిగా భావిస్తున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకే ఆ అంశంపై చర్చను కోరుతున్నామని అన్నారు. "కానీ కేంద్ర సర్కార్ పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చ జరిపేందుకు ఇష్టపడడం లేదు. ఎందుకంటే ఆ అంశంపై చర్చ జరిపితే ఇతర విషయాలు బయటకు వస్తాయి. ప్రధాని మోదీ వైఖరి బయటపడుతుంది. మోదీ ఎలా రాజీ పడ్డారు? ఆయనను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారు? వంటి విషయాలు తెలుస్తాయి. అందుకే పార్లమెంట్‌లో పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు కేంద్రం ఇష్టపడడం లేదు. చర్చకు డిమాండ్ చేస్తున్న సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్ నుంచి ఎలా పారిపోయారో మీరు చూశారు. ఒకవేళ పశ్చిమాసియా సంక్షోభంపై చర్చ జరిగితే ప్రధాని మోదీ పార్లమెంట్‌కు రాలేరు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే వీబీ జీ రామ్ జీ అమలు నేపథ్యంలో కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ మండిపడింది. ఈ పథకం వివరాలు ఇంకా రూపొందుతున్నాయని, ఇది మోదీ ప్రభుత్వ వేగవంతమైన విధానానికి సరైన ఉదాహరణ అని పేర్కొంది. 'మొదట ప్రకటించండి, తరువాత ఆలోచించండి' అనే విధానాన్ని కేంద్రం అనుసరిస్తోందని మండిపడింది. ఈ మేరకు కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. "2025 డిసెంబరులో కేవలం రెండు రోజుల్లోనే మోదీ ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభలో ఎంజీనరేగా రద్దును బుల్డోజ్ చేసింది. రాష్ట్రాలతో ఎటువంటి సంప్రదింపులు జరపలేదు. సంబంధిత స్టాండింగ్ కమిటీ ద్వారా ఎటువంటి పరిశీలన జరగలేదు. 2026 ఏప్రిల్ 1నుంచి కొత్త చట్టం అమలు కానుంది. దీని అమలుకు ముందుగా జరగాల్సిన సంప్రదింపులు ఇప్పుడు జరుగుతున్నాయి. వివరాలు ఇంకా రూపొందుతున్నాయి" అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. కాగా, పశ్చిమాసియా ఘర్షణల వేళ రాజ్యసభలో సోమవారం కీలక ప్రకటన చేశారు కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్. పశ్చిమాసియాలోని పరిణామాలు అందరికీ ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. వాటిపై ఎప్పటికప్పుడు ప్రధాని మోదీ సమీక్ష జరుపుతున్నారని తెలిపారు. అలాంటి పరిస్థితులకు చర్చలు, దౌత్యపరమైన చర్యలే పరిష్కారమని అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియా ప్రాంతాల్లో నివసిస్తున్న భారతీయుల సంక్షేమం, భద్రతపై తమ ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. భారత వినియోగదారులపై భారం పడకుండా, చమురు లభ్యత, ధరలను నియంత్రించేందుకు దౌత్య పరంగా కృషి చేస్తున్నట్టు చెప్పారు. అలాగే పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించేందుకు భారత్ అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని అన్నారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న సుమారు కోటి మంది భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టినట్టు వివరించారు. కాగా, పశ్చిమాసియా సంక్షోభం పార్లమెంట్ ఉభయ సభలను సోమవారం కుదిపేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు రాజ్యసభ, లోక్‌సభలో నిరసనలు చేపట్టాయి. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నాయని బీజేపీ ఎంపీలు ఆరోపించారు.

## శ్రీవారికి అపచారం చేస్తే ఊరుకునేది లేదు

మొదటి తరువాయి

ఉండటం ఏంటి అని ప్రశ్నించారు. ఇదేంటని అడిగితే బాధితులపైనే కేసులు పెట్టారని విమర్శించారు. వైసీపీ హయాంలో జరిగిన తప్పులను సరిచేస్తున్నామని చెప్పారు. రికార్డులు తారుమారు చేయకుండా పకడ్బంధీగా పాస్‌పుస్తకాలు ఇస్తున్నామని, క్యూఆర్ కోడ్‌తో పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎవరు తప్పు చేసినా వెంటనే తెలుస్తుందన్నారు. ఒక్కపైసా కూడా అవినీతి లేకుండా పట్టా ఇప్పించే బాధ్యత తమదని స్పష్టం చేశారు. సమస్యలన్నీ పరిష్కరించాకే కొత్త పాక్ బుక్స్ ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎక్కడా తప్పులు జరగకుండా చూస్తామని సీఎం అన్నారు. గత ఐదేళ్లు దుర్మార్గ పాలన సాగిందని సీఎం విమర్శించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవారి ప్రసాదాన్ని కూడా కల్తీ చేశారని సీఎం ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. సీబీఐ రిపోర్ట్ ఇచ్చినా లడ్డూ కల్తీపై తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తిరుమలపై దృష్టి పెట్టానని సీఎం తెలిపారు. కల్తీ మద్యంతో చాలా మంది చనిపోయేలా చేశారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. హంద్రీనీవాతో తాగునీరు, కుప్పానికి కూడా నీళ్లు ఇచ్చామని చెప్పారు. రాయలసీమలో ప్రతి ఎకరానికి నీళ్లు ఇవ్వాలనేది తన సంకల్పమని పేర్కొన్నారు. మాజీ మంత్రి వివేకాను దారుణంగా చంపారని.. నాన్న లేరు చిన్నాన్న కూడా లేరంటూ డ్రామాలు ఆడారని సీఎం విమర్శించారు. నారాసుర రక్తచరిత్ర అంటూ తన చేతిలో కత్తి పెట్టారని ఆరోపించారు. జగన్ మాటలు నమ్మి 2019లో తనకు ఓటు వేయలేదని చెప్పారు. తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఎదురుదాడి చేస్తున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. డబ్బు మీద ఆశతో ఒక్కరి కంటే ఎక్కువ మందిని కనడం లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పుడు ఇద్దరి కంటే ఎక్కువ మందిని కనాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. పెద్ద కుటుంబానికి ఎక్కువ సహాయం చేసేలా పథకాలు తీసుకొస్తామన్నారు. రైతే రాజు కావాలని.. రైతు అప్పులపాలు కావడానికి వీల్లేదన్నారు. దీపం పథకం ద్వారా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. గత పాలనకు ఈ పాలనకు తేడా ఏంటో ప్రజలే గమనించాలన్నారు.

# సంపాదకీయం


## మన సార్వభౌమాధికారానికే సవాలు



అంతర్జాతీయ న్యాయసూత్రాలనన్నింటినీ అడ్డగోలుగా ఉల్లంఘిస్తూ సామ్రాజ్యవాదం నేడు మూడవ ప్రపంచ దేశాల సార్వభౌమాధికారాన్నే రద్దు చేసేంతవరకూ పోతోంది. అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ మీద బాంబు దాడికి దిగడం దీన్నే సూచిస్తోంది. ఇరాన్‌లో అధికారంలో ఉన్నవారిని గద్దెదించి తమకు నచ్చినవారిని ఆ స్థానంలో కూర్చోపెట్టడమే లక్ష్యం అని ట్రంప్ బహిరంగంగానే ప్రకటించాడు! తమకు ఇబ్బంది కరంగా తయారైన ప్రభుత్వాలను కూల్చడానికి కుట్రలు పన్నడం సామ్రాజ్య వాదులకు కొత్తేమీ కాదు. కాకపోతే అటువంటి దేశాలలో సైనికపరంగా జోక్యం చేసుకోడానికి ఇంతవరకూ వేరే ఏవో సాకులను చూపేవారు. ప్రజాబాహుళ్యాన్ని అంతం చేయగల భయంకర మారణా యుధాలను ఆ దేశం తయారు చేసిందనో, మాదకద్రవ్యాల రవాణా ఆ దేశ ప్రభుత్వమే చేపట్టిందనో–ఇలా సాకులను చూపేవారు. ఇప్పుడు ఇరాన్ మీద దాడికి తెగబడ్డప్పుడు అటువంటి సాకులు చూపే ప్రయత్నం కూడా చెయ్యలేదు. నిజానికి ఇరాన్‌తో ఉన్న వివాదం ఆ దేశం అణ్వాయుధాల తయారీ సామర్ధ్యాన్ని పెంపొందించుకుం టోందన్న ఆరోపణ చుట్టూ నడుస్తోంది. ఆ విషయమై ఒకపక్క చర్చలు కూడా కొనసాగుతూనే వున్నాయి. ఆ చర్చల్లో కొంత పురోగతి కూడా సాధించారు. అయినప్పటికీ అవేమీ ఖాతరు చేయకుండా అమెరికా దాడికి దిగింది. వలస పాలనా కాలం అంతమయ్యాక ఒక మూడవ ప్రపంచ దేశపు ప్రభుత్వాన్ని తన ఇష్టం వచ్చిన రీతిలో గద్దెదించి వేసే అధికారాన్ని బాహాటంగా తనకు తాను అమెరికా ఆపాదించుకోవడం ఇదే మొదటిసారి. ఇరాన్‌లోని ఇస్లామిక్ ప్రభుత్వానికి ప్రజాబాహుళ్యపు మద్దతు ఉందా లేదా అన్న విషయం కాని, అది ప్రజలను అణగదొక్కు తున్న ప్రభుత్వమా అన్నది కాని, అక్కడ వాక్‌స్వాతంత్ర్యం ఉందా లేదా అన్నది కాని, ఆ ప్రభు త్వం ప్రతిపక్షాన్ని సహిస్తుందా లేదా అన్నది కాని ఇక్కడ ప్రధానాంశం కాదు. తమను ఈ ప్రభుత్వం పరిపాలించాలా వద్దా అన్న విషయాన్ని తేల్చుకునే హక్కు, అవసరమైతే ప్రభుత్వాన్ని మార్చుకునే హక్కు ఇరాన్ దేశ ప్రజానీకానికి మాత్రమే ఉందన్నది ఇక్కడ ప్రధానాంశం. మరొక దేశపు అంతర్గత వ్యవహారాల్లోకి బలప్రయోగం ద్వారా జోక్యం చేసుకునే హక్కు గాని, పెత్తనం గాని అమెరికన్ సామ్రాజ్య వాదానికి లేదు. ఒక దేశానికి సార్వభౌమాధికారం ఉండడం అంటేనే ఆ దేశ వ్యవహారాలను నిర్ణయించుకునే సంపూర్ణ హక్కు ఆ దేశ ప్రజానీకానికి మాత్రమే ఉండడం. రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో మూడవ ప్రపంచ దేశాలన్నింటిలోనూ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరా టాల పర్యవసానంగా అవన్నీ సార్వభౌమాధికారాన్ని సాధించుకున్నాయి. ఇన్నాళ్లూ సామ్రాజ్యవాదం మూడవ ప్రపంచ దేశాల సార్వభౌమాధికారాన్ని దెబ్బతీయడానికి దొడ్డిదారిన అనేక ప్రయత్నాలు సాగిస్తూ వచ్చింది. ఇప్పుడు బహిరంగం గానే సైనిక బలప్రయోగంతో దెబ్బతీయడానికి సిద్ధమైంది. ఇది దేశాల సార్వభౌమా ధికారం మీద ప్రత్యక్ష దాడి. చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి తెరలేచింది. స్వాతంత్ర్య పోరాటాలు సాధిం చిన విజయాలను తిరగదోడి మూడవ ప్రపంచ దేశాలను మళ్లీ తమ ఆధీనంలోకి తెచ్చుకోడానికి జరుగుతున్న ప్రయత్నం ఇది. ఇటువంటి దాడికి దిగడానికి సామ్రాజ్యవాదానికి అంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఇప్పుడు నెలకొన్న పరిస్థితుల్లో ఈ విధంగా దాడిచేయాల్సిన అవసరం సామ్రాజ్య వాదానికి ఏమొచ్చింది? మొదటి ప్రశ్నకు సమాధానం సూటిగానే లభిస్తుంది. సోవియట్ యూని యన్ పతనం అనంతరం ప్రచ్ఛన్న యుద్ధ దశ ముగిసిపోవడంతో సామ్రా జ్యవాదాన్ని నిరోధించగల పరిస్థితులు లేవు. ఉదాహరణకు క్యూబా విషయమే తీసుకోండి. అక్కడ కూడా ప్రభుత్వం మార్పు జరగాల్సిందేనంటూ అమెరికా మాట్లాడుతోంది. 1962లో తలెత్తిన క్యూబన్ మిస్సైల్ సంక్షోభం వంటి సందర్భంలో బలాబలాల పరిస్థితికి నేటి పరిస్థితికి తేడా ఎంత కొట్టవచ్చినట్టు కనిపిస్తోందో చూడండి. అప్పుడు క్యూబాను అమెరికన్ యుద్ధ నౌకలు చుట్టుముట్టినప్పుడు సోవియట్ యూనియన్ తన యుద్ధనౌకలను పంపి అమెరికన్ నౌకలను పేల్చివేసైనా సరే ఆ దిగ్బంధనాన్ని చెదరగొట్టమని ఆదేశించింది. ఆ క్రమంలో అణుయుద్ధంగా ఆ ఘర్షణ పరిణమించే ప్రమాదం కూడా ఏర్పడింది. ఆ పరిస్థితిలో అమెరికా వెనక్కితగ్గక తప్పలేదు. ఆ తర్వాత కాలంలో మరే దేశం విషయంలోనూ అమెరికా అటువంటి ప్రయత్నాన్ని తలపెట్ట డానికి సాహసించలేదు. ఇక రెండవ ప్రశ్నకి వద్దాం. ప్రస్తుతం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్న సంక్షోభ పరిస్థితిలో రెండు అంశాలు ఉన్నాయి. మొదటిది: సంపన్న పెట్టుబడిదారీ దేశాల జాతీయా దాయాలలో అక్కడి కార్మికుల వాటా తీవ్రంగా తగ్గిపోయింది. అదే విధంగా మూడవ ప్రపంచ దేశాల జాతీయాదాయాలలో అక్కడి శ్రామిక ప్రజానీకపు వాటా కూడా దారుణంగా తగ్గిపోయింది. మిగులు సంపద శ్రామిక ప్రజలవద్ద చేరితే దానినంతటినీ వినియోగిస్తారు. అదే సంపద ఒకదగ్గర కేంద్రీకరణ జరిగితే అందులో వినిమయానికి నోచుకునేది చాలా స్వల్పం. అందువలన స్థూల డిమాండ్‌తో పోల్చినప్పుడు మార్కెట్‌లోకి వచ్చే ఉత్పత్తి ఎక్కువగా ఉండి అధికోత్పత్తి సంక్షోభం తలెత్తుతుంది. దీని పర్యవసానంగా నిరుద్యోగం పెరుగుతుంది (నిరుద్యోగం పెరుగుతోందన్న విషయాన్ని కప్పి పుచ్చడానికి అమెరికాలో పదాలు మార్చి కార్మికులు ఉత్పత్తిలో భాగస్వాములు అయ్యే రేటు తగ్గుతోందని అంటున్నారు). ఇందువలన శ్రామిక ప్రజలు మరింత దరిద్రంలోకి నెట్టబడతారు. ప్రస్తుత సంక్షోభానికి దారి తీసిన రెండవ అంశం: మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు రోజుల్లో తమ తమ వలస దేశాల నుండి మిగులు సంపదను కాజేయడం ద్వారా గాని, ఆ దేశాల్లో పరిశ్రమలను నాశనం చేయడం ద్వారా కాని వలస పాలకులు తమ విదేశీ చెల్లింపుల లోటును భర్తీ చేసుకునే వీలుండేది. సామ్రాజ్యవాద శిబిరానికి నాయక స్థానంలో ఉండే దేశం ఎప్పుడైనా తక్కిన దేశాలతో వాణిజ్య చెల్లింపులలో లోటును కలిగివుంటుంది (ఆ దేశాల నుండి దిగుమతులను తన మార్కెట్‌లోకి అనుమతిస్తుంది. తద్వారా ఆ దేశాల సహకారాన్ని పొందుతుంది). ఇప్పుడు అమెరికాకు కూడా అటువంటి లోటు ఉంది. దానికితోడు ప్రపంచం మీద తన పెత్తనాన్ని చెలాయించడం కోసం అమెరికా దాదాపు 80 దేశాలలో 750కి పైగా సైనిక స్థావరాలను నెలకొల్పింది. దీనికయ్యే ఖర్చు కూడా అమెరికా లోటు పెరగడానికి తోడైంది. మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వపురోజుల్లో సామ్రాజ్యవాద శిబిరానికి నాయకుడు బ్రిటన్. ఆ దేశానికి ఉండిన లోటును భర్తీ చేసుకోడానికి బ్రిటన్ భారతదేశంతో సహా తన వలస దేశాల నుండి మిగు లును తరలించుకుపోయింది. ఇప్పుడు నాయకుడి స్థానంలో ఉన్న అమెరికాకి వలసలు అంటూ ఏవీ లేవు. అందుచేత తన లోటును భర్తీ చేసుకోడానికి డాలర్లను అదనంగా ముద్రించడం మినహా దానికి వేరే దారి లేదు. ఇలా అదనంగా ముద్రించిన డాలర్లతోను, డాలర్ల రూపంలో ఉన్న ఆస్తులతోను (షేర్లు, స్టాక్‌లు, బాండ్లు వగైరా) ప్రపంచం నిండి పోయింది. అదంతా అమెరికా ప్రపంచానికి చెల్లించవలసిన అప్పే. డాలర్ కరెన్సీ బలం మీదనే ఇప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడ ఆధారపడి వుంది. ఆ డాలర్ బలం ప్రశ్నార్థకంగా మారుతోంది.

# ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఖమేనికి కంగ్రాట్స్ చెప్పిన పుతిన్..

### ఇరాన్‌కు అండగా ఉంటామని హామీ



**న్యూఢిల్లీ,మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా ఎన్నికైన అయతొల్లా మొజ్తాబా ఖమేనికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అభినందనలు తెలిపారు. ఇరాన్‌కు మద్దతుగా ఉంటామని పుతిన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం పుతిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎన్నికైన మొజ్తాబాకు శుభాకాంక్షలు. ఈ క్లిష్ట సమయంలో ఇరాన్‌కు రష్యా అండగా నిలబడుతుంది. ఇరాన్‌లోని మా స్నేహితులకు, వారి సమగ్రతకు రష్యా మద్దతుగా ఉంటుంది. మొజ్తాబా తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఇరాన్ ప్రజల్ని ఏకతాటిపైకి తెస్తారని భావిస్తున్నాం. యుద్ధం కొనసాగుతున్న ఈ సమయంలో నాయకత్వం వహించడానికి మొజ్తాబాకు గొప్ప ధైర్యం, పట్టుదల కావాలి" అని పుతిన్ తన సందేశంలో పేర్కొన్నారు. ఒకవైపు మొజ్తాబా ఎన్నికపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే, రష్యా మాత్రం మద్దతుగా నిలవడం విశేషం. ఈ యుద్ధ సమయంలో ఇరాన్‌కు రష్యా నైతిక మద్దతు ప్రకటించింది. ఇటీవలే ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్తో పుతిన్ ఫోన్లో మాట్లాడారు. దాడుల్లో మరణించిన ఖమేనీ, అతడి కుటుంబ సభ్యులు, ఇరాన్ ప్రజలు, సైనికులకు పుతిన్ సంతాపం తెలిపారు. దీనికి మసౌద్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తాజాగా ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తాబాను అక్కడి అసెంబ్లీ ఎన్నుకున్న సంగతి తెలిసిందే. 1969లో జన్మించిన మొజ్తాబా ఇరాన్‌లోనే మత గురువుల వద్ద విద్యనభ్యసించారు. తాజాగా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మొజ్తాబా తండ్రి, ఇరాన్ సుప్రీం లీడర్ అయిన అయతొల్లా ఖమేని, తల్లి, అతడి భార్య కూడా మరణించారు. మొజ్తాబా ఎన్నికతో అతడి మద్దతుదారులు ఇరాన్‌లో సంబరాలు చేసుకుంటున్నారు. కాగా.. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంలో ఇరాన్‌కు రష్యా ఇంటెలిజెన్స్ సహకరిస్తోందనే ఆరోపణలున్నాయి. దీనిపై అమెరికా కూడా ఆరోపణలు చేసింది.

# అలా చేస్తే ఆస్తులు సీజ్ చేస్తాం..

### విదేశాల్లో ఉంటున్న పౌరులకు ఇరాన్ హెచ్చరిక




**న్యూఢిల్లీ,మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

విదేశాల్లో ఉంటున్న తమ దేశ పౌరులకు ఇరాన్ కీలక హెచ్చరిక జారీ చేసింది. తమ శత్రువులకు మద్దతుగా నిలిస్తే ఇరాన్‌లోని వారి ఆస్తులను సీజ్ చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ అటార్నీ జనరల్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన చేసింది. ఈ విషయాన్ని ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఈ ఆదేశాల ప్రకారం.. విదేశాల్లో ఉంటున్న ఇరాన్ పౌరులు ఆ దేశానికి వ్యతిరేకంగా వ్యవహరించకూడదు. శత్రువులకు సహకరించడం, మద్దతు తెలపడం వంటివి చేయకూడదు. ముఖ్యంగా ఇజ్రాయెల్, అమెరికాలకు అనుకూలంగా ఉండకూడదు. ఒకవేళ అలా చేస్తే ఇరాన్‌లోని వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటారు. శత్రువుల చర్యలను సమర్ధించినా, సహకరించినా ఇదే అమలవుతుంది. చట్ట ప్రకారం వారి ఆస్తులను సీజ్ చేస్తామని తెలిపింది. ఇరాన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే వారిని శత్రువులు కింద పరిగణించి, వారి ఆస్తులను జప్తు చేసే అధికారం తమకు ఉందని వెల్లడించింది. ఇంటెలిజెన్స్, గూఢచర్యం వంటి వాటికి పాల్పడినా ఇదే గతి పడుతుందని హెచ్చరించింది. ఇజ్రాయెల్, అమెరికా ప్రభుత్వాలతో కలిసి పని చేయకూడదని కూడా సూచించింది. మరోవైపు ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇరాన్‌లోని రాజధాని టెహ్రాన్ సహా కీలక పట్టణాలు, ప్రభుత్వ సంస్థలు, నిర్మాణాల్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులకు పాల్పడుతూనే ఉంది. అలాగే లెబనాన్‌లోని హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థ స్థావరాలు, నిర్మాణాలపై దాడులు చేస్తామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) హెచ్చరించింది. దీంతో ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయాలని ప్రజలకు సూచించింది. అల్ ఖర్ద్ అల్ హసన్ సంస్థకు చెందిన ఫైనాన్సియల్ నెట్‌వర్క్‌పై భారీ దాడులు చేస్తామని తెలిపింది. మరోవైపు ఇరాన్.. ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై దాడులు చేస్తోంది.

# హోటళ్లను తాత్కాలికంగా మూసేస్తాం!

### గ్యాస్ కొరతతో బెంగలూరు రెస్టారెంట్ ఓనర్ల హెచ్చరిక



**బెంగళూరు మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

పశ్చిమాసియాలో ఘర్షణలు రెస్టారెంట్ల యజమానులతోపాటు కుటుంబాల్లో కూడా కలవరాన్ని సృష్టిస్తున్నాయి. ఎల్పీజీ సిలిండర్ల సరఫరాలో ఏర్పడుతున్న కొన్ని అవాంతరాలే వారి ఆందోళనకు కారణం. వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల సరఫరా నిలిచిపోవడంతో తాత్కాలికంగా చాలా హోటళ్లు మూతపడనున్నట్లు బెంగళూరులోని హోటళ్ల యజమానులు సోమవారం తెలియచేశారు. సోమవారం ఉదయం తమకు ఎల్పీజీ సిలిండర్ సరఫరా ఆగిపోయినట్లు వారు చెప్పారు. విద్యార్థులు, డ్రైవర్లు, బ్రహ్మచారులు, వృద్ధులు, ఇంకా అనేకమందికి ఆహారాన్ని అందచేసే హోటళ్లు కూడా అత్యవసర సర్వీసులుగానే పరిగణించాలని, సిలిండర్ల సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని బృహత్ బెంగళూరు హోటల్స్ అసోసియేషన్‌కు చెందిన పీసీ రావు తెలిపారు. గత కొన్ని రోజులు గృహ వినియోగదారుల నుంచి వంటగ్యాస్ బుకింగ్ పెరిగిపోయినట్లు గ్యాస్ ఏజెన్సీలు గుర్తించాయి. తమ బుకింగ్‌లను అనుమతించడం లేదని పలువురు గృహ వినియోగదారులు ఫిర్యాదు చేస్తున్నారు.

# సీఈసీపై అభిశంసన.. తీర్మానానికి సిద్ధమవుతున్న విపక్షాలు

### ఈ వారంలోనే నోటీసు ఇచ్చే అవకాశం



**న్యూఢిల్లీ, మార్చి 9 డ్రీమ్ టైమ్స్**

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తొలగింపునకు పార్లమెంట్‌లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ తీర్మానానికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైందని, ఈ వారంలోనే నోటీసు ఇచ్చే అవకాశముందని తెలిసింది. ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా, ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నాయని టీఎంసీ సీనియర్ ఎంపీ వెల్లడించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానం ముసాయిదా సిద్ధమైందని అన్నారు. ఒకేసారి రెండు సభల్లో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఎన్నికల కమిషనర్ తన పదవిని పూర్తిగా దుర్వినియోగం చేశారని ఆ నాయకుడు ఆరోపించారు. ఇండియా కూటమిలోని ఇతర పార్టీలన్నీ ఈ అభిశంసన తీర్మానానికి అనుకూలంగా ఉన్నాయని, ముసాయిదా రూపకల్పనలో భాగస్వామ్యమైనాయని తెలిసింది. తీర్మానంపై అన్ని పార్టీల నాయకులు ఎంపీల సంతకాలను సేకరించనున్నారు. లోక్‌సభ నుంచి కనీసం 100, రాజ్యసభ నుంచి కనీసం 50 మంది సంతకాలు అవసరమని ఓ నాయకుడు తెలిపారు. పార్లమెంట్ ద్వారా హైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించేందుకు అనుసరించే విధానమే సీఈసీ తొలగింపునకు కూడా వర్తిస్తుందని అన్నారు.

# ఉద్యమి సభ్యత్వాల నమోదు పై అవగాహన.



**శిరివెళ్ళ.( డ్రీమ్ టైమ్స్ )**
ఆళ్లగడ్డ తాలూకా జనసేన పార్టీ ఇరిగెల బ్రదర్స్ కార్యాలయంలో నిర్వహించిన ఉద్యమి సభ్యత్వాల నమోదు పై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల జిల్లా పార్లమెంట్ జనసేన పార్టీ పరిశీలకులు , పొన్నూరు మాజీ శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు జనసేన పార్టీ శిరివెళ్ల మండల ఇంచార్జ్ ఇరిగెల ప్రతాప్ రెడ్డి పిలుపు మేరకు శిరివెళ్ల మండల కన్వీనర్ పసుల నరేంద్ర ఆధ్వర్యంలో భారీ ఎత్తున జనసేన పార్టీ నాయకులు , జనసైనికులు ఆళ్లగడ్డకు తరలి వెళ్లారు. పార్టీ బలోపేతం కోసం చేపట్టిన ఈ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు , కార్యకర్తలు , జనసేన అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే యువత పెద్ద ఎత్తున సభ్యత్వాలు నమోదు చేసుకొని పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని పసుల నరేంద్ర కోరారు.

# మోడల్ ప్రైమరీ స్కూల్ లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఏపి పిఎస్ హెచ్ఎం జిల్లా అధ్యక్షులు పి మహబూబ్ షరీఫ్



**తనకల్లు మార్చి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
తనకల్లు మండల కేంద్రంలోని మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు శ్రీ సత్యసాయి జిల్లా ఏపి పిఎస్ హెచ్ఎం అసోసియేషన్ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపి పిఎస్ హెచ్ఎం అధ్యక్షులు పి మహబూబ్ షరీఫ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని,సమానత్వం,సౌభ్రాతృత్వం కల్పించాలని కొనియాడారు. మహిళలు నూరు శాతం అక్షరాస్యత సాధించాలని అని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సమాన హక్కులు కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో తనకల్లు మండల విద్యాధికారులు లలితమ్మ, కళ్యాణి,రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హుర్ భాను, తమ అమూల్యమైన సందేశాన్ని తెలియచేశారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయుల వెన్ను తట్టి సహాయ సహకారలు అందిస్తున్న విద్యాశాఖాధికారులు లలితమ్మ, కళ్యాణి లను రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హుర్ భాను, విద్య బోధనలో వినూత్న కార్యక్రమాలతో రాణిస్తున్న ఉపాధ్యాయులు జమీలా,పార్వతి, విజయ లక్ష్మీ, అనిత, మండల విద్యాశాఖాధికారి సిబ్బంది అఫ్రోజా,గౌరమ్మ లను ఏపి పిఎస్ హెచ్ఎం అధ్యక్షులు పి మహబూబ్ షరీఫ్, ఉపాధ్యక్షులు రవీంద్ర నాయక్, జానకిరామ్ శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించడం జరిగింది.

# జనసేన ఉద్యమానికి భారీ స్పందన




**చిట్వేల్, మార్చి 9 డ్రీమ్ టైమ్స్:**
జనసేన పార్టీ చేపట్టిన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని చిట్వేల్ మండలం రాజుకుంట గ్రామానికి చెందిన జనసేన సారథి మద్దూరి మన్మధ ఆధ్వర్యంలో 500 పైగా సభ్యత్వాలు నమోదు చేయడం విశేషంగా నిలిచింది.
పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ పెద్ద సంఖ్యలో యువతను, అభిమానులను సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం పట్ల జనసేన పార్టీ నాయకత్వం ఆయనను అభినందించింది. గ్రామీణ స్థాయిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చురుకుగా పనిచేస్తున్నారని నాయకులు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మరింత మంది ప్రజలను జనసేన పార్టీ వైపు ఆకర్షిస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించాయి.

# జాబ్ మేళాలో 24 మందికి ఉద్యోగాలు



**బనగానపల్లె , మార్చి 9 ( డ్రీమ్ టైమ్స్ )**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో నిర్వహించిన జాబ్ మేళాలో 24 మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలితా తెలిపారు సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జి సెంటర్,ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు . ఈ ఉద్యోగ మేళ లో తమ కాలేజీ కి చెందిన 24 మంది విద్యార్థులు పలు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత తెలిపారు. కార్యక్రమం లో మూడు ప్రధాన కంపెనీలు పాల్గొన్నాయని, వీటిలో యమహా కంపెనీకి 7మంది, ఈ ఏం ఎస్ గ్రూప్సఅఫ్ కంపెనీస్ కి 14 మంది, మరియు పి ఏ వై టి ఎం కంపెనీకి 3 విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ జాబ్ డ్రైవ్ లో 62 నిరుద్యోగ యువకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్. లలిత గారు, జేకేసీ సమన్వయకర్త డాక్టర్ జి. నీతమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మహమ్మద్ గౌస్, ఐ క్వి ఏ సి సమన్వయకర్త డాక్టర్ కె. బడే సాహెబ్, శ్రీ ఎన్.ఉమా మహేశ్వర రెడ్డి, జేకేసీ మెంటార్ ఉమా శంకర్, శ్రీ కె ఆంజనేయులు మరియు కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి విద్య ఇంటర్న్‌షిప్ కార్యక్రమం విజయవంతంగా ముగింపు



**చిట్వేల్ మార్చి 9 డ్రీమ్ టైమ్స్**
:తిరుపతి జిల్లా పి.ఎం.శ్రీ. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిట్వేల్ నందు 10వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించిన 10 రోజుల వృత్తి విద్య ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ఐటీ ,ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ విభాగంలో విజయవంతంగా పూర్తయ్యింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ నైపుణ్యాలు మరియు వృత్తి విద్యపై అవగాహన కల్పించబడింది. ఈ ఇంటర్న్‌షిప్‌లో విద్యార్థులు వివిధ కార్యాచరణల్లో ఉత్సాహంగా పాల్గొని అనుభవాన్ని సంపాదించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సహించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా పాల్గొన్న 10వ తరగతి విద్యార్థులకు సర్టిఫికెట్లు మరియు టీ-షర్టు అందజేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో నైపుణ్యాలు పెంపొందించడానికి మరియు భవిష్యత్ వృత్తి అవకాశాలపై అవగాహన కల్పించడానికి ఎంతో ఉపయోగపడుతుంది అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు దుర్గ రాజు మరియు వృత్తి విద్య ఉపాధ్యాయులు చిన్నబాబు రఫీ మరియు నాగమణి విద్యార్థుల ఉత్సాహాన్ని అభినందించారు.

# అరుంధతి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

**బనగానపల్లె , మార్చి 9 డ్రీమ్ టైమ్స్**
116వ అరుంధతి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పూలరాజు కోరారు. సోమవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో మార్చి 14 తేదీన చలో విజయవాడ అరుంధతి అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం కరపత్రాలను ఎమ్మార్పీఎస్ నాయకులు, మహిళలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు పూలరాజు మాదిగ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన విజయవాడలో అరుంధతి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో



నిర్వహిస్తున్నామని జిల్లాలోని మాదిగలు మహిళలు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు .మహిళలపై నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అన్నగారిన బడుగు బలహీన వర్గాల మహిళలు అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు .మహిళల ఆత్మగౌరవం కోసం ప్రభుత్వం సంపూర్ణ మద్యపనాన్ని నిషేదించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఒక మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చౌరయ్య, మహిళా మండలి అధ్యక్షురాలు పెరికలసుబ్బమ్మ , ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మి , కైప గ్రామ అధ్యక్షులు కలగొట్ల వెంకటస్వామి, మధు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

# గర్భిణీ మహిళలకు పౌష్టికాహారం పంపిణీ

**బనగానపల్లె, మార్చి 9 డ్రీమ్ టైమ్స్**
పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో గర్భిణీ మహిళలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో టిడిపి నాయకురాలు బీసీ ఇందిరా రెడ్డి సొంత నిధులతో 100 మంది గర్భిణీ, బాలింత మహిళలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూపుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో, శారీరక,మానసిక వికాసంతో ఎదగాలంటే గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాల్సిన్నారు. పోషకాహార లోపం కారణంగా గర్భిణీ స్త్రీలు రక్తహీనత వంటి సమస్యలకు గురై, ప్రసవ సమయంలో అనేక సంక్లిష్టతలను ఎదుర్కొంటున్నారని, తల్లీ-బిడ్డల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిరంతరం



కొనసాగిస్తున్నట్లు ఆమె తెలిపారు. గర్భిణీ స్త్రీలకు సరైన పోషకాహారంపై అవగాహన కల్పించడం, వారికి అవసరమైన పోషకాలు అందించడం ద్వారా మాత్రమే ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించవచ్చని పేర్కొన్నారు. ప్రతి నెల 9వ తేదీన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సొంత నిధులతో గర్భిణీ స్త్రీలకు ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమం ద్వారా తల్లులకు ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు, పుట్టబోయే శిశువుల శారీరక ఎదుగుదల మరింత బలపడుతుందని అన్నారు. గర్భిణీ స్త్రీలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఆహారంలో పోషక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె సూచించారు. తల్లీ-బిడ్డల ఆరోగ్యమే సమాజ భవిష్యత్తు అన్న సంకల్పంతో చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలు ప్రజారోగ్య రంగంలో ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియా డిపార్ట్మెంట్ వైద్యురాలు డాక్టర్ ఉమాదేవి, వైద్యశాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా ఉమామహేశ్వరుల పల్లకి సేవ మహోత్సవం

**బనగానపల్లె , మార్చి 9 డ్రీమ్ టైమ్స్**
మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవం వైభవంగా జరిగింది సోమవారం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ఉమామహేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ప్రదోషకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను పల్లకి లో



ఊరేగింపు నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఆలయ కార్యనిర్వణ అధికారి పాండురంగారెడ్డి , ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వరరెడ్డి ,పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి , అర్చకులు ,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణలో గో హత్య నిరోధక చట్టం అమలులో వైఫల్యం విహెచ్‌పి విమర్శ

**హైదరాబాద్,మార్చి 9 ( డ్రీమ్ టైమ్స్ )**
విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) ఆధ్వర్యంలో గోరక్ష ప్రాంత సమావేశం కోటి లో జరిగింది. ఈ సందర్భంగా అఖిల భారతీయ గోరక్ష సహా ప్రముఖ్ ఆకారపు కేశవరాజు మాట్లాడుతూ తెలంగాణలో గో హత్య నిరోధక చట్టం అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అక్రమ పశువధశాలలు రాష్ట్రంలో విస్తృతంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. గో మాఫియా దారులపై పీడీ యాక్ట్ అమలు చేయాలని, ఇప్పటి వరకు గోవుల అక్రమ రవాణాలో కేసులు బుక్ అయిన వాహనాలను సీజ్ చేయాలని విహెచ్‌పి డిమాండ్ చేసింది. బక్రీద్ సందర్భంగా గో హత్యలు జరగకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు. హిందూ సమాజాన్ని చైతన్యం చేస్తూ గోమాత రక్షణ కోసం ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో క్షేత్ర గోరక్ష ప్రముఖ్ యాదగిరి రావు, ప్రాంత కార్యదర్శి లక్ష్మినారాయణ, సహ కార్యదర్శి రమేష్, ప్రాంత గోరక్ష ప్రముఖ్ సుభాష్ చందర్, ప్రాంత సహ ప్రముఖ్ రాజారాం, ఊటుకూరి రాధాకృష్ణ, రమేష్, స్వారాజ్యం, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా ముగిసిన ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్

**కరీంనగర్, మార్చి 9 ( డ్రీమ్ టైమ్స్ )**
: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో వారం రోజులపాటు జరిగిన ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ క్రీడా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిభ ఆధారంగా క్రీడల్లో రాణించే పరిస్థితి లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌సీఏలో పైరవీలు, డబ్బులు తీసుకుని సెలెక్షన్లు జరగడం వల్ల క్రీడాకారుల ప్రతిభ దెబ్బతింటోందని, ఈ దుస్థితికి చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో రాబోయే దశాబ్ద కాలానికి 'ఖేలో ఇండియా' మిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మిషన్ ద్వారా క్రీడాకారుల ప్రతిభాభివృద్ధి, కోచ్‌లు, సహాయక సిబ్బంది వ్యవస్థాగత అభివృద్ధి, స్పోర్ట్స్ సైన్స్ & టెక్నాలజీ సమీకరణతోపాటు పెద్ద ఎత్తున పోటీలు, లీగ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో మార్చి 1 నుండి 7 వరకు జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు, జట్లకు బహుమతులను బండి సంజయ్ స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్, డిప్యూటీ మేయర్ కొలగాని శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు గుజ్జ శ్రీనివాస్, మాడ వెంకటరెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.




# 99 రోజుల ప్రణాళికలో అందరూ భాగస్వామ్యులు కావాలి

**- ఎం.ఎస్. రాజ్ ఠాకూర్**

**గోదావరిఖని, మార్చి 9 ( డ్రీమ్ టైమ్స్ )**
: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. గోదావరిఖనిలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు పార్టీ శ్రేణులతో కలిసి ఆయన 5కే రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అద్భుతమైన పరిపాలన నడిపిస్తున్నారని, ప్రతి పల్లె, నగరంలో అభివృద్ధి సాధించి మహిళలందరికీ ఆర్థిక భరోసా కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం 10 లక్షల కోట్లు అప్పు చేసినా, ప్రస్తుత ప్రభుత్వం ధైర్యంగా ఉద్యోగులకు జీతాలు ఇస్తూ సంక్షేమాన్ని ముందుకు నడిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఇంటి తోపాటు వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని, ఎవరో వస్తారని ఎదురు చూడకుండా కాలనీల సమస్యలను మనమే పరిష్కరించుకోవాలని సూచించారు. రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని పట్టణ ప్రజలతో మేయర్ మహంకాళి స్వామి ప్రతిజ్ఞ చేయించారు. యువత అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని, శుభ్రత ప్రమాణాలను పాటిస్తూ తెలంగాణను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మహిళలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.




# మహిళలను గౌరవించాలి

**- కౌన్సిలర్ పాపిశెట్టి రాము**

**ఆమనగల్లు, మార్చి 9 ( డ్రీమ్ టైమ్స్ )**
ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని ప్రముఖ సంఘసేవకుడు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో మహిళా మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల నాయకులను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రేమ, త్యాగం, సహనం కలిస్తేనే మహిళ అని కొనియాడారు. మహిళలు పురుషులతో సమానంగా ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, కౌన్సిలర్లు ఎనుమల్ల రమేష్, నాగిళ్ల జగన్, కాలే యశోదమ్మ, నాయకులు శ్రీను నాయక్, కాలే విక్రమ్, మహిళా సంఘాల లక్ష్మీ, విజయ, స్వాతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు




**కరీంనగర్,మార్చి 9 ( డ్రీమ్ టైమ్స్ )**
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) ఈకో క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే మునిసిపల్ పార్క్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈకో క్లబ్ కోఆర్డినేటర్, లైఫ్ సైన్సెస్ విభాగాధిపతి డా. నల్ల మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి కలిగే హానికర ప్రభావాలను వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పునర్వినియోగ పదార్థాలను ప్రోత్సహించడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగించవచ్చని సూచించారు. కళాశాల అధ్యాపకులు అతియా సుల్తానా, రవళి కృష్ణ, డా. సుజాత, ప్రియాంక, రేఖారాణి, నారాయణ, యకంబరం, రమ్య, రాఖా, మౌనిక తదితరులు విద్యార్థినులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు పార్క్ పరిసరాల్లో ప్లాస్టిక్ చెత్తను సేకరించి శుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు కూడా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని విద్యార్థినులు పిలుపునిచ్చారు.

# ఐటీఐలో షార్ట్ టర్మ్ కోర్సుల ప్రారంభం



**పెద్దపల్లి, మార్చి 9 ( డ్రీమ్ టైమ్స్ )**
:ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు చేతుల మీదుగా 6 షార్ట్ టర్మ్ కోర్సులు, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా 2 షార్ట్ టర్మ్ కోర్సులు ప్రారంభమయ్యాయి. అలాగే ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా కూడా నిర్వహించారు. ప్రిన్సిపల్ బుసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ కోర్సుల ద్వారా విద్యార్థులు త్వరగా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంప్లాయ్మెంట్ అండ్ ట్రైనింగ్ మంత్రి గడ్డం వివేక్, ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, డైరెక్టర్ శ్రీమతి కాంతి వెస్లే కూడా ఈ కోర్సుల ప్రాముఖ్యతను వివరించారు. ఎమ్మెల్యే విజయ రమణ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఐటీఐకి అవసరమైన రా మెటీరియల్, ఇంటర్నల్ రోడ్లు, కాంపౌండ్ వాల్ పెంపు కోసం నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి 450 మంది విద్యార్థులు హాజరయ్యారు. మున్సిపల్ ఛైర్మన్ నుగిళ్ళ మల్లయ్య, వార్డ్ కౌన్సిలర్లు కమల్, సుధాకర్, హన్మంతు, ఐటీఐ సిబ్బంది మల్లికార్జున స్వామి, గైనీ శ్రీనివాస్, మహేందర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రానికి ఎస్బీఐ చేయూత





**పాలకుర్తి, మార్చి 9 ( డ్రీమ్ టైమ్స్ )**
పాన్ ఇండియా సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా పాలకుర్తి మండలం జీడి నగరంలోని అంగన్వాడీ కేంద్రానికి ఎస్బీఐ చేయూత అందించింది. బసంత్‌నగర్ స్టాఫ్ కాలనీలోని ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ ప్రేమ్ చంద్ర ఆధ్వర్యంలో టీవీ, వాచ్, గ్లాసులు, పుస్తకాలు, డ్రాయింగ్ పెన్నులు, వాటర్ టిన్నులు తదితర అవసరమైన వస్తువులను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ శారద, మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ ఛైర్మన్ లక్ష్మి రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బిజినెస్

## బంగారం, వెండి ధరలు ధమాల్..

### భారీగా తగ్గిన రేట్లు..!



మహిళలకు గుడ్‌న్యూస్.. బంగారం, వెండి ధరలు భారీ స్థాయిలో తగ్గుముఖం పట్టాయి. పరుగులు పెడుతున్న బంగారం, వెండి ధరలుకు బ్రేకులు పడ్డాయి. ఇటీవల పెరిగిన ధరల నేపథ్యంలో పెట్టుబడిదారులు లాభాల బుకింగ్ చేయడం, అలాగే అమెరికన్ డాలర్ బలపడటం వంటి కారణాల వల్ల ఈ పతనం నమోదైనట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఏర్పడిన పరిస్థితులు దేశీయ బులియన్ మార్కెట్‌పై కూడా ప్రభావం చూపడంతో ధరలు కొంత మేర తగ్గినట్లు కనిపిస్తోంది.అయితే ప్రతి రోజు ఉదయం 10 గంటల సమయంలో బంగారం ధరలు అప్‌డేట్ అవుతుంటాయి. అలాగే సోమవారం ధరలు అప్‌డేట్ అయిన తర్వాత భారీగా తగ్గుముఖం పట్టాయి.24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై ఏకంగా 1950 రూపాయలు తగ్గుముఖం పట్టగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై 1800 వరకు దిగి వచ్చింది. అలాగే వెండి విషయానికొస్తే దీనిపై ఏకంగా 5000 రూపాయల వరకు తగ్గింది.ధరలు తగ్గిన తర్వాత హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,61,680 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,48,200 రూపాయల వరకు దిగి వచ్చింది.ఇక వెండి విషయానికొస్తే ధర తగ్గిన తర్వాత కిలో వెండి ధర హైదరాబాద్, చెన్నై, కేరళ రాష్ట్రాల్లో 2,90,000 రూపాయల వద్ద కొనసాగుతుండగా, ఇతర రాష్ట్రాల్లో 2,80,000 రూపాయల వద్ద కొనసాగుతున్నాయి.

## స్టాక్ మార్కెట్‌లకు యుద్ధం దెబ్బ..

### భారీగా నష్టాలతో ముగింపు

పశ్చిమాసియాలో ఇరాన్ పై అమెరికా , ఇజ్రాయెల్ దాడులు.. ఇరాన్ ప్రతిదాడులు భీకరంగా కొనసాగుతున్నాయి. ఈ యుద్ధం ఇవాళ దేశీయ స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. ఉద్రిక్తతల కారణంగా భారత స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 1,352.74 పాయింట్లు పతనమై 77,566.16 వద్ద స్థిరపడింది.అదేవిధంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 422.40 పాయింట్లు నష్టపోయి 24,028.05 వద్ద ముగిసింది. ముఖ్యంగా నిఫ్టీ తన ఆల్ టైమ్ హై నుంచి 10 శాతానికిపైగా పతనమై అధికారికంగా 'కరెక్షన్ జోన్' లోకి ప్రవేశించింది. జనవరి 5న నిఫ్టీ 26,373 స్థాయిని తాకింది. అయితే సెషన్ మధ్యలో ముడిచమురు ధరలు కాస్త తగ్గడంతో మార్కెట్లు ఇంట్రాడే కనిష్ఠ స్థాయిల నుంచి కొంతమేర కోలుకున్నాయి.



కనిష్టస్థాయి 23,868 నుంచి నిఫ్టీ 160 పాయింట్లు, 76,424 నుంచి సెన్సెక్స్ 1,142 పాయింట్లు రికవరీ అయ్యాయి. విస్తృత మార్కెట్లలో సైతం నష్టాలు తప్పలేదు. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.97 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.22 శాతం మేర క్షీణించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో తీవ్ర అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ అత్యధికంగా 3.97 శాతం పతనమైంది. మరోవైపు ఐటీ రంగం మాత్రం సానుకూలంగా స్పందించి 0.08 శాతం స్వల్ప లాభంతో ముగిసింది. ప్రస్తుత పరిస్థితులపై మార్కెట్ నిపుణులు స్పందించారు. నిఫ్టీకి 23,700--23,600 వద్ద తక్షణ మద్దతు లభిస్తుందని అన్నారు. ఒకవేళ ఆ స్థాయిని కోల్పోతే 23,400--23,300 వైపు పడిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. మార్కెట్ కోలుకోవాలంటే 24,300, 24,600 స్థాయిలను దాటాల్సి ఉంటుందని తెలిపారు. రాబోయే రోజుల్లో అమెరికా-ఇరాన్ పరిణామాలు, ముడిచమురు ధరల హెచ్చుతగ్గులపైనే మార్కెట్ కదలికలు ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## పడిపోయిన కోడి గుడ్ల ధరలు..

కోడి గుడ్లు తినేవారికి శుభవార్త. గుడ్ల ధరలు భారీగా పతనమవుతున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ ప్రభావం పౌల్ట్రీ పరిశ్రమపై పడింది. యుద్ధం కారణంగా భారత్ నుంచి విదేశాలకు గుడ్ల ఎగుమతులు నిలిచిపోయాయి. ఉద్రిక్త పరిస్థితుల క్రమంలో రవాణా చేయడం కష్టంగా మారడం వల్ల సరఫరా నిలిచిపోయంది. దీని వల్ల భారత్‌లో గుడ్ల నిల్వలు ఎక్కువగా ఉండటంతో ధరలు పడిపోయాయి. రోజురోజుకి గుడ్ల ధరలు తగ్గుతూ వస్తోండటంతో సామాన్యులకు ఊరట కలుగుతోంది. అయితే పౌల్ట్రీ రైతులు మాత్రం దీని వల్ల నష్టపోతున్నారు. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో కూడా గుడ్ల వినియోగం తక్కువగా



ఉండటంతో ధరలు పతనమవుతున్నాయి.

**ఒక్కో గుడ్డు ఎంతంటే..?**

ప్రస్తుతం ఒక్కో గుడ్డు ధర రూ.5 పలుకుతోంది. నెక్ ధరల ప్రకారం మార్చి 1న రూ.4.58గా ఉండగా.. వారం రోజుల్లో 0.33 పైసలు తగ్గింది. దీంతో ప్రస్తుతం రూ.4.25గా ఉండగా.. బహిరంగ మార్కెట్లో రూ.5కి విక్రయిస్తున్నారు. వేసవి కాలం వస్తుండటం, ఎగుమతులు నిలిచిపోవడమే ధరల తగ్గదలకు కారణంగా చెబుతున్నారు. ప్రతీ ఏటా సమ్మర్‌లో ఎగ్ ధరలు తగ్గుముఖం పడుతూ ఉంటాయి. ఈ సారి కూడా అదే విధంగా ధరలు పతనమవుతూ వస్తోన్నాయి. వినియోగదారులకు తక్కువ ధరకే లభిస్తుండగా.. పౌల్ట్రీ రైతులు మాత్రమే నష్టపోతున్నాయి. మేత ధరలు పెరగడం, నిర్వహణ ఖర్చులు పెరగ్గా.. మార్కెట్లో ధరలు తక్కువగా ఉండటం వల్ల నష్టపోతున్నారు.

# స్పోర్ట్స్

## కోచ్‌గా, ఆటగాడిగా రెండేసి ఐసీసీ ట్రోఫీలు..

### భారత్‌కు లక్కీ హ్యాండ్‌గా గంభీర్..!

: నరేంద్రమోడీ స్టేడియంలో పంజా విసిరిన భారత జట్టు వరుసగా రెండోసారి టీ20 ఛాంపియన్‌గా నిలిచింది. సంచలన ఆటతో తొలిసారి పొట్టి కప్‌ను ఒడిసిపట్టాలనుకున్న న్యూజిలాండ్ కలల్ని కల్లలు చేసిన టీమిండియా.. మూడో కప్‌ను ముద్దాడింది. స్వదేశంలో మూడేళ్ల క్రితం వన్డే వరల్డ్‌కప్ చేజారిన బాధను మరిపించే విజయంతో సూర్యకుమార్ యాదవ్ సేన ట్రోఫీని కొల్లగొట్టింది. ఈ విజయంలో ఆటగాళ్ల కష్టంతో పాటు ప్రధాన కోచ్ గౌతం గంభీర్ పాత్ర కూడా ఎనలేనిది. ప్రయోగాల పేరుతో జట్టును నాశనం చేస్తున్నాడని అతడిని విమర్శించిన వాళ్లే ఇప్పుడు నువ్వు గొప్ప కోచ్.. జట్టును ఛాంపియన్‌గా తీర్చిదిద్దావు అని పొగుడుతున్నారు.సొంతగడ్డపై ఫేవరెట్‌గా బరిలోకి దిగి అదిరే ఆటతో పొట్టి ప్రపంచకప్‌ను ముద్దాడింది. ఐసీసీ ఫైనల్లో మెరుగైన రికార్డున్న న్యూజిలాండ్‌ను భారత జట్టు 96 పరుగుల తేడాతో చిత్తు చేసి కప్‌ను పట్టేసింది. ఇంతటి విజయంలో ఆటగాళ్ల కృషి ఎంతుందో.. కోచ్ గంభీర్ కష్టం



కూడా అంతే ఉందని చెప్పాలి. రెండేళ్ల క్రితం రాహుల్ ద్రవిడ్ వారసుడిగా భారత కోచింగ్ పగ్గాలు చేపట్టిన గౌతీ.. ప్రయోగాలతో విమర్శలపాలయ్యాడు. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్.. టెస్టు సిరీస్‌ను 2-0తో దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్ చేసింది. ఈ నేపథ్యంలో టీ20 వరల్డ్‌కప్ గంభీర్ కోచింగ్‌కు పరీక్షలా నిలిచింది.వస్తూనే సీనియర్లను పక్కన పెట్టేసి కుర్రాళ్లను సానబెడుతూ వచ్చిన అతడు.. ప్రపంచకప్‌లో ఫలితాలు చవిచూశాడు. ఇంకేముంది.. ఇన్నాళ్లుగా మనోడిని తిట్టిన నోళ్లతోనే ప్రశంసలు అందుకుంటున్నాడు. నరేంద్ర మోడీ స్టేడియంలో న్యూజిలాండ్‌ను 96 పరుగులతో మట్టి కరిపించిన భారత్ మూడోసారి పొట్టి కప్‌ను కొల్లగొట్టింది. కోచ్‌గా నిరుడు ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ అందించిన గంభీర్ తొలి ఐసీసీ ట్రోఫీని దేశానికి కట్టబెట్టాడు. ఇప్పటికే ఆటగాడిగా ఈ దిగ్గజం రెండు వరల్డ్‌కప్‌లు గెలుపొందిన విషయం తెలిసిందే. ఎంఎస్ ధోనీ సారథ్యంలో 2007లో టీ20 వరల్డ్‌కప్.. తిరిగి 2011లో ధోనీ నాయకత్వంలోనే వన్డే ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టులో గౌతీ సభ్యుడు కావడం విశేషం.తొలి సీజన్ పొట్టి ప్రపంచకప్ ఫైనల్లో పాకిస్థాన్‌పై అర్ధ శతకంతో రాణించిన అతడు.. వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో శ్రీలంకపై మెరుపు అర్ధ శతకంతో భారత్ విజయంలో కీలకమయ్యాడు. అందుకే గంభీర్‌ను ఐసీసీ వరల్డ్‌కప్ టోర్నమెంట్లలో లక్కీ హ్యాండ్‌గా పేర్కొంటున్నారు కొందరు. ఐపీఎల్‌లోనూ.. కెప్టెన్‌గా కోల్‌కతా నైట్ రైడర్స్‌ను రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన అతడు.. మెంటర్‌గా మరో ట్రోఫీని అందించిన విషయం తెఇసిందే.

## స్విస్ ఓపెన్ నుంచి సింధు ఔట్.. లక్ష్య సేన్ డౌటే..!

ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఆడలేకపోయిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు (గాం ాఆఅఅస్త్రబ) కీలక నిర్ణయం తీసుకుంది. తీవ్ర భయాందోళన మధ్య దుబాయ్ నుంచి స్వదేశం వచ్చిన సింధు.. స్విస్ ఓపెన్‌లోనూ ఆడకూడదని తీర్మానించుకుంది. మూడు రోజుల దుబాయ్‌లో బిక్కుబిక్కుమంటూ గడిపిన తను.. మానసికంగా, శారీరకంగా సన్నద్ధంగా లేనందునే స్విస్ ఓపెన్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్టు పేర్కొంది.పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దుబాయ్‌లో చిక్కుకున్న పీవీ సింధు ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు దూరమైంది. మూడు రోజుల తర్వాత స్వదేశం చేరుకున్న తెలుగు తేజం ఇంకా కుదురుకోలేదు. దాంతో.. వెంటనే కోర్టులోకి దిగేందుకు ఆమె సిద్ధంగా లేదు. సో.. స్విట్జర్లాండ్ ఓపెన్ టోర్నమెంట్ నుంచి



వైదొలగాలని సింధు నిర్ణయించుకుంది.రెండోసారి కూడా ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో కంగుతిన్న లక్ష్య సేన్(ఘుఎంష్ట్రఘు ావఅ) సైతం ఈ పోటీల్లో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. మార్చి 10 నుంచి మొదలయ్యే ఈ ఈవెంట్‌కు తాను అందుబాటులో ఉండదని ఆమె తెలిపింది. స్విట్జర్లాండ్‌లోని సెయింట్ జకొబ్‌షల్లేలో మార్చి 10వ తేదీ నుంచి మార్చి 15 వరకూ స్విస్ ఓపెన్ జరుగనుంది.

## భారత వరల్డ్‌కప్ కోచ్‌ను పట్టేసిన శ్రీలంక..

### గెలుపు బాట తొక్కిస్తాడా..!



పొట్టి ప్రపంచకప్‌లో సూపర్ 8 దశలోనే నిష్క్రమించిన శ్రీలంక వన్డే ప్రపంచకప్‌పై గురి పెట్టింది. స్వదేశంలో చెత్త ఆటతో నిరాశపరిచిన లంకను గాడీలో పెట్టేందుకు గ్యారీ కిరెస్టెన ను ఆశ్రయించింది ఆ దేశ బోర్డు. అనుభవజ్ఞుడైన ఈ దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడిని రెండేళ్ల కాలానికి ప్రధాన కోచ్‌గా నియమించింది శ్రీలంక క్రికెట్. సనత్ జయసూర్య (ఘుఅఫ్త్ర ఝుఘుంబతీఅఘు) స్థానాన్ని కిర్‌స్టెన్ భర్తీ చేయనున్నాడు. సుదీర్ఘ అనుభవమున్న గ్యారీ ఏప్రిల్ నుంచి లంక కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు.రెండేళ్ల కిత్రం టీ20 ప్రపంచకప్ వైఫల్యాన్ని సొంతగడ్డపై కొనసాగించిన శ్రీలంక సూపర్ 8లోనే ఇంటిదారి పట్టింది. వరల్డ్‌కప్ హీరో, మాజీ ఆటగాడు సనత్ జయసూర్య కోచింగ్‌లో ఏడాది కాలంగా గొప్పగా ఆడిన లంక.. వరల్డ్‌కప్‌లో మాత్రం తేలిపోయింది. స్వదేశంలోనూ చతికిలపడిన లంకకు కోచ్‌గా ఉండలేనని జయసూర్య వైదిలిగాడు. అతడి రాజీనామాతో కొత్త కోచ్ వేటను మొదలెట్టిన శ్రీలంక క్రికెట్ అనుభవజ్ఞుడైన గ్యారీ కిర్‌స్టెన్‌ను తదుపరి కోచ్‌గా నియమించింది. రెండేళ్ల కాంట్రాక్ట్‌లో భాగంగా ఏప్రిల్ 15వ తేదీ నుంచి అతడు కోచ్‌గా సేవలందించనున్నాడు.

**కోచ్‌గా ఘనతలు..**

ఆటగాడిగా విజయవంతమైన కిర్‌స్టెన్ కోచ్‌గానూ గొప్పగా రాణించాడు. 2011లో భారత జట్టు వన్డే వరల్డ్‌కప్ విజయంతో కీలకమైన గ్యారీ.. ఆపై ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టును అరంగేట్రంలోనే ఛాంపియన్‌గా నిలిపాడు. అనంతరం పాకిస్థాన్ జట్టుకు కొన్నిరోజులు కోచ్‌గా సేవలందించిన అతడు.. పొట్టి వరల్డ్‌కప్‌లో నమీబియా జట్టుకు కన్సల్టెంట్‌గా పని చేశాడు. వచ్చే ఏడాది వరల్డ్‌కప్ పోటీలకు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యమిస్తున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయంగా101 టెస్టులు, 185 వన్డేల్లో దక్షిణాఫ్రికాకు కిర్‌స్టెన్ ప్రాతినిధ్యం వహించాడు.



# రిలీజ్‌కు ముందే సంచలనం సృష్టిస్తున్న ధురంధర్ 2 ..

### ప్రీమియర్ టికెట్ సేల్స్‌లో కొత్త రికార్డు

ఇండియాలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో “ధురంధర్ 2” ఒకటి. విడుదలకు ఇంకా కొద్ది రోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో ఈ చిత్రం భారీ క్రేజ్ ను సంపాదించుకుంది. ముఖ్యంగా ప్రీమియర్ షోల అడ్వాన్స్ బుకింగ్స్ లో ఈ సినిమా కొత్త రికార్డులను నమోదు చేస్తూ దూసుకెళ్తోంది. దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్ మార్చి 19, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ట్రైలర్ విడుదలైన వెంటనే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. గత వారం ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత ప్రీమియర్ షోల కోసం అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభించగా, టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి.అడ్వాన్స్ బుకింగ్స్ మొదలైన 24 గంటల్లోనే కేవలం బుక్‌మైషో ప్లాట్‌ఫామ్‌లోనే సుమారు 87 వేల టికెట్లు అమ్ముడయ్యాయి. మార్చి 9 ఉదయం నాటికి అదే ప్లాట్‌ఫామ్‌లో ఈ సంఖ్య 1.5 లక్షలకు పైగా చేరింది. ఇతర టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌లను కూడా కలిపితే మొత్తం ప్రీమియర్ టికెట్ల సంఖ్య 2 లక్షలను దాటినట్లు సమాచారం.సినిమా ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఇప్పటివరకు ప్రీమియర్ షోల కోసం దేశవ్యాప్తంగా సుమారు 2.06 లక్షల టికెట్లు అమ్ముడయ్యాయి. ఈ టికెట్ల అమ్మకాల ద్వారా దాదాపు రూ.12.29 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. ఇందులో ఎక్కువ భాగం ఒరిజినల్ హిందీ వెర్షన్ నుంచే వచ్చినట్లు తెలుస్తోంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, తమిళ డబ్బింగ్ వెర్షన్ కూడా మంచి స్పందన దక్కించుకుంది. ప్రీమియర్ షోల నుంచే తమిళ వెర్షన్ దాదాపు రూ.10 లక్షల వసూళ్లు సాధించిందని సమాచారం. మొత్తం మీద ప్రీమియర్ షోల ద్వారా అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ సినిమాగా “ధురంధర్ 2” కొత్త రికార్డు సృష్టించింది. ఇంతకు ముందు బాలీవుడ్‌లో ఈ రికార్డు “స్త్రీ 2” పేరిట ఉండేది. ఆ సినిమా ప్రీమియర్ షోల ద్వారా సుమారు రూ.10 కోట్ల వసూళ్లు సాధించింది. అయితే ఇప్పుడు ఆ రికార్డును “ధురంధర్ 2” సులభంగా అధిగమించి కొత్త మైలురాయిని నెలకొల్పింది. ఇంకా ప్రీమియర్ షోలకు దాదాపు తొమ్మిది రోజుల సమయం ఉండటంతో ఈ వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆసక్తికర విషయం ఏమిటంటే, కొన్ని సినిమాల మొదటి రోజు వసూళ్ల కంటే కూడా “ధురంధర్ 2” ప్రీమియర్ షోల ద్వారా ఎక్కువ కలెక్షన్లు రావడం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.




# సల్మాన్‌కు జోడీగా నయనతార



దక్షిణాదిన అగ్రస్థానంలో ఉన్న కథానాయిక ఎవరంటే.. 'నయనతార' అని టక్కున చెప్పేస్తారు. పారితోషికం పరంగా కూడా నయనే నంబర్ వన్. ప్రస్తుతం ఆ భాష, ఈ భాష అని లేకుండా, అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తూ సత్తా చాటుతున్నది నయనతార. మెగాస్టార్‌తో ఆమె రీసెంట్ హిట్ 'మన శంకర వరప్రసాద్‌గారు' టాలీవుడ్ రీజనల్ సినిమాల్లో నంబర్‌వన్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం బాలకృష్ణ 'ఎన్‌బికె 111'లో కథానాయికగా నటిస్తున్నది నయనతార. ఇక తమిళంలో అయితే.. ఆమె చేతిలో చాలా సినిమాలున్నాయి. ఇదిలావుంటే.. రీసెంట్‌గా ఓ బాలీవుడ్ సినిమాకు నయన్ సైన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ హీరోగా రూపొందనున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి టాలీవుడ్ డైరెక్టర్ పైడిపల్లి వంశీ దర్శకుడు. దిల్‌రాజు నిర్మిస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది. ఇక నయన్ నటించిన తమిళ చిత్రం 'ముక్తీ అమ్మన్' సమ్మర్‌లో విడుదల కానుంది.



# చిత్ర పరిశ్రమలో ట్రోల్స్ పెద్ద పదం

### ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నా

విమర్శల నుంచి నేను చాలా నేర్చుకున్నానంటోంది హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్. 'మేడ్ ఇన్ కొరియా' సినిమాతో త్వరలోనే వీక్షకులందరికీ కొరియా సంస్కృతిని పరిచయం చేసే తమిళ అమ్మాయిగా ఓటీటీలో సందడి చేయనుంది. ఈ సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె సామాజిక మాధ్యమాల్లో తనపై వస్తున్న ట్రోల్స్ గురించి స్పందించింది. 'సోషల్ మీడియాలో 'ట్రోల్స్' అనేది చాలా పెద్ద పదం. గతం గురించి ఆలోచించడం నాకు ఇష్టం లేదు. కానీ, ఇది చిత్రపరిశ్రమ. అనిశ్చితమైన పరిస్థితులు ఎదురవుతాయి. ఇక్కడ ఎవరికైనా ఏదైనా జరగొచ్చు. నేను దాని నుంచే చాలా నేర్చుకున్నాను. సహజంగానే ట్రోల్స్ బాధించినా ఎదగడానికి తోడ్పడతాయి. కొన్నిసార్లు మీరు పడిపోతేనే పైకి రావడానికి అలాంటివి సహాయపడతాయి. నేను ఇలాంటి ప్రతికూల పరిస్థితులను సానుకూలంగా మార్చుకుంటూ కెరీర్‌ని ముందుకు తీసుకెళ్లాలనుకుంను' అని చెప్పింది. గతంలో ప్రియాంక తనపై కొందరు ఉద్దేశపూర్వకంగానే ట్రోల్స్ చేస్తున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.

# సూపర్ మ్యాన్ తరహా స్టోరీతో అల్లు అర్జున్



అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ - మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ కలయికలో సినిమా ఎప్పట్నుంచో ప్రచారంలో ఉంది. సూపర్‌మ్యాన్ తరహా కథతో సినిమా తెరకెక్కే అవకాశం ఉన్నట్టు కూడా పరిశ్రమలో చర్చ సాగింది. అయితే అల్లు అర్జున్ వరుసగా తమిళ దర్శకుడు అట్లీ, లోకేశ్ కనగరాజ్‌లతో సినిమాలకు పచ్చజెండా ఊపడంతో, బసిల్ జోసెఫ్‌తో సినిమా గురించి చర్చకు బ్రేక్ పడింది. ఇటీవల జరిగిన అల్లు శిరీష్ పెళ్లి వేడుకకు బసిల్ జోసెఫ్ హాజరు కావడంతో మరోసారి ఆయన, అల్లు అర్జున్ కలయికలో సినిమా తెరపైకొచ్చింది. ఇద్దరూ కలిసి సినిమా చేయడం ఖాయమనే సంకేతాలు వచ్చినట్టైంది. బసిల్ జోసెఫ్ మలయాళంలో కథానాయకుడిగా నటిస్తూనే, దర్శకుడిగా పలు విజయాల్ని అందుకున్నారు.

# త్రిషకు పార్తీబన్ క్షమాపణలు



ఇటీవల చెన్నైలో జరిగిన ఓ ఈవెంట్‌లో త్రిషను ఉద్దేశించి నటుడు, దర్శకుడు పార్తిబన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై త్రిష కూడా పరోక్షంగా స్పందించడంతో ఆయన మరో పోస్ట్ పెట్టారు. ఈ విషయంలో జరిగినదంతా తప్పుగా భావించారు. ఇప్పుడు నాకు పశ్చాత్తాపపడటం తప్ప మరో మార్గం లేదఅని తన పోస్ట్‌లో రాశారు. దీంతో ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పడినట్లు అయింది. అసలేం జరిగిందంటే.. గత కొన్ని రోజులుగా త్రిష ప్రేమకు సంబంధించిన రూమర్స్ వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె కోలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్‌తో కలిసి ఓ వివాహ వేడుకకు హాజరుకావడం ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. ఓ ఈవెంట్‌లో త్రిష గురించి పార్తిబన్ మాట్లాడుతూ.. ఆమె కొన్ని రోజులు ఇంట్లోనే ఉండటం మంచిది. ఎందుకంటే ఆమె బయటకు వస్తే ఎక్కడ లేని సమస్యలు వస్తున్నాయని అన్నారు. ఈ వ్యాఖ్యలపై త్రిష పరోక్షంగా స్పందించారు. 'చేతిలో మైక్ ఉంది కదా అని మాట్లాడితే కామెడీ అవ్వదు. అది కేవలం మూర్ఖత్వమే' అని పోస్ట్ పెట్టారు.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831